ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
మార్చి 15, 2015

సంచలన సంపాదకుడు **వినోద్**

ఎన్ని ఉగాదులో...



స్టైలిష్ స్టార్

ఫ్యాషన్ అనేది ఏ ఒక్కరికో పరిమితం కాదు. అందరిదీ. మామూలు వాళ్లను పక్కన పెడితే హీరోలు, హీరోయిన్లనే చూద్దాం. ఫ్యాషన్ హీరోయిన్లకు మాత్రమే వర్తిస్తుందనుకుంటే పొరబాటే. హీరోలూ స్టైలిష్‌గానే కనిపించాలి. మరప్పుడే కదా అభిమానగణాన్ని ఆకట్టుకోగలిగేది! మనకు సంబంధించి ఫ్యాషన్‌కు బాలీవుడ్డే పెట్టింది పేరు. ఇంతకీ బాలీవుడ్‌లో స్టైలిష్ స్టార్లుగా పేరొందిన తారలెవరో ఓసారి చూద్దాం.

అమితాబ్ బచన్‌ని ఒకప్పుడు సినిమాలకే పనికి రాడన్నారట. గొంతు బాలేదు. హెయిర్ స్టైయిల్ బాలేదు. విపరీతమైన పొడుగ్గా వున్నాడు. అని తిరస్కరించారట. అలాంటి అమితాబ్ ఇప్పుడు స్టైలిష్ స్టార్. ఆయన ఏ రకం కోటు వేసుకున్నా, టై కట్టుకున్నా, ప్యాంటు తొడుక్కున్నా ఫ్యాషనే. పత్రికల్లో వచ్చిన కథనాలనే నమ్ముతుంటాం కదా. బిగ్ బి ఓసారి షాపింగ్ చేయడం కోసం లండన్‌లోని డోల్సే అండ్ గబ్బనా స్టోర్‌కి వెళ్లారట. ఆయన కోసం అప్పటి వరకు స్టోర్‌లో వున్న కస్టమర్లందరినీ పంపించేశారట. బచ్చన్ సాబ్ ఎలాంటి చికాకులు లేకుండా ప్రశాంతంగా బట్టలు ఎంపిక చేసుకోవడానికే సదరు స్టోర్‌వారు ఈ ఏర్పాటు చేశారనుకోవాలి. అంతెందుకు గత ఏడాది కేన్స్ ఫెస్టివల్ సందర్భంగా ఆయన వేసుకున్న డ్రెస్‌కు మీడియాలో ఎంత ప్రచారం లభించిందో చూశాం కదా. ఫ్యాషన్‌గా వుండాలనీ, అందునా కచ్చితంగా వుండాలనీ కోరుకునే స్టార్ హృతిక్ రోషన్. ఆ విషయంలో చాలా శ్రద్ధ తీసుకుంటాడు. తెర మీదా, తెర బయటా కూడా స్టైయిలిష్‌గా వుండడానికి ఎంతో ప్రాధాన్యతనిస్తాడు. అయితే ఒక విషయంలో మాత్రం చాలా నిక్కచ్చిగా వుంటాడు. బట్టలు ఫ్యాషనబుల్‌గా వుండాలి. అదే సమయంలో సౌకర్యవంతంగా వుండాలి. ఇదే హృతిక్ ఫ్యాషన్ రహస్యం. షారూక్ ఖాన్‌ను మించి స్టైలిష్‌గా ఎవరు మాత్రం కనబడతారు. ఎక్కువగా నలుపు, తెలుపు, నీలం రంగు వస్త్రాలనే ఎంచుకున్నప్పటికీ ఇతర రంగులను ముట్టుకోడని కాదు. అత్యంత ఖరీదైన బ్రాండ్ వస్త్రాలతో వార్డ్‌రోబ్ నిండిపోయినప్పటికీ... ఎక్కువగా రెండు జతల జీన్స్, బూట్లనే వేసుకోవడానికి మొగ్గుచూపుతాడు. ఆయన ఏ బ్రాండ్ బట్టలు వేసుకున్నా... అది ఎస్.ఆర్.కె బ్రాండ్‌గా మారిపోవడం చూస్తుంటాం. రణవీర్ సింగ్ కొత్త తరం నటుడైతేనేం! ఆయన ఒడ్డూ పొడవుకు తగ్గట్టే వుంటుంది ఆయన వేసుకునే డ్రెస్ కూడా. మొత్తం మీద ఫ్యాషన్ యువరాజుగా వెలిగి పోతుంటాడని అంటుంటారు అభిమానులు. సందర్భంతో పని లేకుండా ఆకట్టుకునే వస్త్రాలు ధరించే తారలలో ఇమ్రాన్ ఖాన్ ఒకరు. పైగా ఫ్యాషన్ గురించి తెలిసిన కొద్ది మందిలో ఒకరు. ఏది వేసుకుంటే నప్పుతుందో...ఏది నప్పదో బాగా తెలుసు. మొత్తం మీద ఖాన్‌ను చూసి... అప్పటి ట్రెండ్ ఏంటో తెలుసుకోవచ్చని ఆంగ్ల పత్రికల కథనం.

●

స్నేహ ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

చిన్ని చిన్ని ఆశ

"చిన్ని చిన్ని ఆశ...చిన్న దాని ఆశ... ముద్దు ముద్దు ఆశ ... ముత్యమంత ఆశ... జాబిలిని తాకి ముద్దులిడు ఆశ... వెన్నెలకు తోడై ఆడుకొను ఆశ...'! తొంబైల్లో విడుదలైన 'రోజా' చిత్ర కథానాయిక ఆశలు ఇవన్నీ. సినిమాల్లో హీరోయిన్లకేనా! ప్రతి ఒక్కరికీ ఆశలుంటాయి. ఆ మాటకొస్తే ఆశలేని వారుండరు.

ఈ ఇంటర్వ్యూలోనైనా ఉద్యోగం రాకపోతుందా... అమ్మకు అయ్యకు కాస్తంత అన్నం పెట్టకపోతానా... అని 'ఆమ్యామ్యాలు' ఇచ్చుకోలేని పేద యువత ఆశ.

సకాలంలో వానలు పడాలని, పండిన పంటకు సరసమైన ధరలు రావాలని అన్నదాత ఆశ.

పొరుగింటి పాపలా మంచి స్కూల్లో చదువుకోవాలని పేదింటి బుజ్జి ఆశ.

•••

దేశానికి జవసత్వాల్లాంటి వారు యువతీయువకులు. అలాంటి యువత ఇవాళ ఉపాధి కోసం, ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుతెన్నులు చూడడం మినహా ఏమీ చేయలేకపోతోంది.

•••

ప్రభుత్వాలను గద్దెనెక్కించే శక్తి...కిందికి లాగిపారేసే సత్తా పుష్కలంతా వున్న వారు మధ్యతరగతి ప్రజలు. కాకపోతే వీరి ఆదాయం బెత్తెడు.... ఆశలు బారెడు. ఆశల పల్లకిలో ఊరేగడంలో వీరికి వీరే సాటి. అందుకు తగ్గట్టుగానే జీతాలు పెరుగుతున్నట్టే వుంటాయి. కాని వచ్చే ఆదాయానికి అయ్యే ఖర్చుకి పొంతనే వుండదు. చంటాణ్ణి మంచి మంచి బడిలో వెయ్యాలంటే లక్షల్లో ఖర్చు చేయాల్సిందే. ఇంట్లో ఒక్కరికి జబ్బు చేస్తే చాలు. కార్పొరేట్ డేగలు సిద్ధంగా వుంటాయి. ఏడాది పాటు వీరు కూడబెట్టుకున్నదంతా మూలుగులతో సహా లాగిపారెయ్యడానికి.

•••

మన చుట్టూ కనిపించేది సామాన్యులే. కనీస సౌకర్యాలు లభిస్తే చాలని ఆశపడుతుంటారు. కానీ కూరగాయలు కొనడానికి సైతం ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిందే. విచిత్రమేమంటే కామన్‌మేన్ కొనబోతే ఆకాశంలో కనిపించే ఆహార పదార్థాల ధరలు...రైతు అమ్మబోతే మాత్రం పాతాళంలోకి జారిపోతాయి. ఈ వైరుధ్యం ఎందుకో మామూలు మనిషికి అర్థమే కాదు.

•••

ఇంతమందికి ఇన్ని ఆశలున్నాయి. నెరవేర్చుకోవడానికి అవకాశలే కరవు. నిజానికి వీరి ఆశలు నెరవేరే అవకాశమే లేదా? దేశంలో సంపద లేదా? సహజ వనరులు లేవా? అంటే అన్నీ వున్నాయి. పని చేయడానికి అందరూ సిద్ధంగా వున్నారు. మరి ఎందుకు తమ ఆశలు తీరడంలేదనే విషయాన్ని అర్థం చేసుకునే చైతన్యం వారిలో కలిగితే... సాధించుకోవడానికి ఎంతైనా కష్టపడతారు. పోరాడతారు. మన్మథ నామ సంవత్సరం వారిలో ఆ చైతన్యం కల్పించాలని ... కోరికలు తీర్చాలని ... ఆశిద్దాం.

■

◆ మనలో మాట

టపా

మ్యాజిక్ మరిపించింది

ఈవారం మ్యాజిక్ మందు చదివాక చాలా సంతోషంగా అనిపించింది. నిజంగా సుదీర్ఘ వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులను నవ్వించగలగడం ఎంతో అదృష్టం అనుకోవాలి. ఆ పని చేస్తున్న ప్రవీణ్‌ది గొప్ప మనసు. ఎవరైనా బాధల్లో వుంటే ఎంతకాడకీ ఏదో ఒక పుల్ల విరుపుడు మాట మాట్లాడి నొప్పిద్దామని చూసేవారే ఎక్కువ మన చుట్టూ. అలాంటిది ఉచితంగా అనాథాశ్రమాలు, ఆస్పత్రులు తిరుగుతూ మ్యాజిక్ షోలు చేస్తూ పిల్లలను ఆ కాసేపైనా సంతోషింపచేస్తున్న ప్రవీణ్‌ను అభినందించి తీరాల్సిందే.

-తిరుపతమ్మ.బి, వైజాగ్.

రంగులు అదుర్స్

ఈవారం మూడు రంగుల పేజీలు ఆకట్టుకున్నాయి. దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే చిత్రం ఇంకా నడుస్తుండడం ఆశ్చర్యపరుస్తుంది. కాకపోతే మీరు రంగుల్లో ఇచ్చిన ఆ సినిమా బొమ్మలు చూస్తే చిత్ర కథ అంతా మరోసారి మదిలో మెదిలినట్టైంది. హ్యాండ్ మోడల్ గురించి చదివాక...ఇలాంటి మోడళ్లు కూడా వుంటారా అనుకున్నాం. నీలిగ్రామం గురించి చదివాక మన పింక్ సిటీని గుర్తుచేసుకున్నాం. పి.వి.సింధు ఇంటర్వ్యూ స్ఫూర్తిదాయకం.

సామ్రాట్, సంగుపాలెం కోడూరు.

వడియాలు అప్పుడేనా!

ఎండాకాలం వచ్చిందన్న విషయం మీరు ఇచ్చిన వడియాల గురించి చదివాక గుర్తొచ్చింది. ముందుచూపుతో ఇచ్చినా...బాగా ముందుగా ఇచ్చేసినట్టనిపించింది. కానీ ఉపయోగమేననుకోండి. ప్రేమ విప్లవం సీరియల్ ఆకట్టుకుంటోంది. కథలో వచ్చిన పాత్రల బొమ్మలు ఇవ్వడం కూడా బావుంది. వారిని ఒక సారి చూడగలుగుతున్నాం.

-కాంచన.ఎం, మదనపల్లి.

కూల్ కూల్ కవర్

ఈవారం వేసవి విడుదుల గురించిన అట్టమీది కథనం ఇవ్వడం బాగుంది. ఏ రాష్ట్రంలో ఏవిధమైన హిల్ స్టేషన్లు వున్నాయో అక్కడ చూడదగిన వివరాలేంటో చదివి తెలుసుకోవడమే కాక కత్తిరించి పెట్టుకున్నాం. ఇలాంటి చోట్లకి వెళ్లినప్పుడు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవ్వడం బాగుంది.

-దీప, మణి, విజయవాడ.

కాలేజీ కుర్రోడు

కాలేజీ కట్టడం కోసం సొంత ఇంటినే అమ్మేసిన కుర్రోడు ప్రాంజల్ గురించి చదివి ఆశ్చర్యపోయామంటే నమ్మండి. ఇంకా ఇలాంటి వాళ్లున్నా రా? అనుకున్నాం. నిజంగా గ్రామీణ యువతకు ఇతను చేసిన, చేస్తున్న సాయానికి ప్రతిగా అతనికి ఏమివ్వగలరు? జీవితాంతం మనసులో పూజించడం తప్ప. ఇలాంటి యువకుల గురించి మరిన్ని కథనాలు ఇవ్వాలని కోరుకుంటున్నాం. అయితే ప్రభుత్వాలు చేయాల్సిన పనులను వ్యక్తులు చేయాల్సి రావడమే విచారకరం.

-సంయుక్త, గుంటూరు.

కన్నీళ్లు పెట్టించిన మాయ

కష్టాలతో సావాసం చేస్తూ నిత్యం పోరాటం చేసే మాయ జీవితం చదివిన మాకు కళ్లు చెమర్చాయి. ఎయిడ్స్ సోకి భర్త చనిపోతే... పిల్లలకోసం గుండె ధైర్యంతో గౌరవప్రదమైన బతుకు తెరువు వెతుక్కున్న మహిళ మాయ. నిజంగా ఆమె ఎందరికో స్ఫూర్తి ప్రదాత.

సంకేత్, వినుకొండ.

ఈ సంచికలో....

ఎన్ని ఉగాదులో..

కవర్‌స్టోరీ 14

ఉగాది...తెలుగు ప్రజల తొలి పండుగ. సంవత్సరాది పండుగ. కొత్త సంవత్సర వేడుక. ఉగాది పండుగంటే చాలు! ఎన్నెసి ఊసులో! ఎన్నెసి రుచులో! ఎంత హడావిడో! తెల్లని మల్లెలూ, పుల్లని మామిళ్లూ, తియ్యటి చెరుకులు, చేదుపూతల వేప పువ్వులు, కవి సమ్మేళనాలు, పంచాంగ పఠన-శ్రవణాలు, కోకిలల కిలకిలా రావాలు, ఉగాది పచ్చళ్లు, పచ్చటి ప్రకృతి అందాలు ... ఒకటా రెండా... ఎన్నని చెప్పకోవాలి?! ఆ రుచులన్నిటి సమ్మేళనంగా జీవితం వుంటుందన్నదే ఈ పండుగ చెప్పకనే చెప్పే జీవన సత్యం.ఈ ఏడాది 'మన్మథ' నామ సంవత్సరంలోకి అడుగెడుతున్నాం.

జీవితం 3
ఏదీ ఆమెకు సరి రాదు

సందర్భం 4
సంచలన సంపాదకుడు వినోద్

వింతలోకం 5
రోబోలకు అంతిమ సంస్కారం

కథ 6
ఎంపు

ప్రత్యేకం 8
తోపుడు బండితో ఇంటింటికి కవిత్వం

సినిమా కబుర్లు 10
ప్రతిభను మించిన అందం లేదు

నవ్వుల్ - పువ్వుల్ 17

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
మజ్జిగ పులుసు

బాలనేస్తాలు 22
పదహారు పదాలు ఎక్కడ

కొత్త పుస్తకాలు 24
విలువైన సమాచారం

చూద్దామా
కువైట్ జ్ఞాపకాలు
............12

ఏదీ ఆమెకు సరి రాదు

ప్రపంచంలోకెల్లా అత్యంత ఎక్కువ జనాభాగల దేశాల్లో మొదటిది చైనా. కాగా రెండవ స్థానాన్ని ఆక్రమించుకున్న భారతదేశంలో జనాభా నియంత్రణకు కు.ని ఆపరేషన్ల మీదే ఎక్కువగా శ్రద్ధ పెడుతుంటుంది ప్రభుత్వం. సంతానం కలగకుండా ఆపరేషన్ చేయించుకున్న ఆడవాళ్లకు చిన్న చిన్న బహుమతులు ఇస్తుంటుంది. అదే పద్ధతిలో గత ఏడాది నవంబర్ తొమ్మిదవ తేదీన జరిగిన కు.ని ఆపరేషన్ల వల్ల పదిహేను మంది చనిపోయారు. వారిలో ఫూల్‌బాయి ఒకరు.

ఛత్తీస్‌గఢ్‌లోని ఒకానొక కుగ్రామం రూప్‌చంద్ శ్రీవాస్‌ది. నలభైఐదేళ్లుంటాయేమో. ముగ్గురు పిల్లల తండ్రి. ఇలా చెప్పేకంటే... 'నాలుగు నెలల క్రితం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగినప్పుడు భార్యను పోగొట్టుకున్న పదిహేనుమందిలో ఒకడు' అని చెప్తే మరింత త్వరగా గుర్తుపట్టొచ్చేమో! కొత్తగా రంగులు వేసిన రెండు గదుల ఇంటి ముందు కూర్చుని శూన్యంలోకి చూస్తూ వున్నాడతను. మాసిన గెడ్డం. ఎరుపుబారిన కళ్లు.... అతని విషణ్ణ వదనానికి చిహ్నాలుగా వున్నాయి. పెద్ద పిల్లలిద్దరూ (నారాయణ్ (9), నికిత (3)) ఇంటికెదురుగా వున్న మట్టిలో ఆడుకుంటున్నారు. ముగ్గురిలోకి చిన్నవాడైన రితేష్ (ఏడాది) తల్లి ఫూల్‌భాయి ఫొటోకి ముద్దులు పెడుతున్నాడు.

రూప్‌చంద్‌కు ఇప్పటికే ముగ్గురు పిల్లలున్నారు. సెలూన్‌లో పని చేసుకునే అతను నెలకు 5 వేల రూపాయలు మాత్రమే సంపాదిస్తాడు. మరొరకరికి జన్మనిచ్చి పోషించగల శక్తి లేనందున ప్రభుత్వ కు.ని ఆపరేషన్ చేయించుకోమని భార్య ఫూల్ బాయికి చెప్పాడు రూప్‌చంద్. దాంతో ఆమె స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పేరు నమోదు చేయించుకుంది. వాళ్లు చెప్పిన తేదీకి రెండు కిలోమీటర్ల ప్రయాణం చేసి పండారిలోని కు.ని క్యాంపుకి చేరుకుంది. చాలా కాలంగా వాడకుండా వదిలేసిన ఆసుపత్రిలో క్యాంపు పెట్టారు. అక్కడ ప్రభుత్వ డాక్టర్ లాప్రోస్కోపిక్ ట్యుబెక్టమీ ఆపరేషన్లు చేశారు.

ఆపరేషన్ థియేటర్ మురికిగా వుందని, పేషెంట్ల సంఖ్య కూడా బాగా ఎక్కువగా వుందని, ఆపరేషన్ మంచాల మీద బెడ్‌షీట్లన్నీ రక్తపు మరకలతో నిండి వున్నాయని, రోగులు మారినప్పుడల్లా వాటిని మార్చి కొత్తది వేసిన దాఖలాలు కనిపించలేదని పోలీసులిస్తున్న సమాచారం.

ఐదు నిముషాల పాటు జరిగిన ఆపరేషన్ అనంతరం ఫూల్‌బాయి అదే ఆసుపత్రిలో గంటసేపు విశ్రాంతి తీసుకుని ఇంటికి వచ్చేసింది. భరించలేనంత నొప్పి, జ్వరం వస్తే వేసుకోమని ఆమెకు వైద్యులు కొన్ని మందుబిళ్లలు ఇచ్చి పంపారు. ఆ రోజు రాత్రి వరకు ఆమె బాగానే వున్నా... మరుసటి రోజు ఉదయం విపరీతమైన ఛాతీ నొప్పి, జ్వరంతో నిలవలేకపోయింది. డాక్టర్లు ఇచ్చిన మందులేవీ పనిచేయకపోయేసరికి పొరుగున వుండే ఆరోగ్య కార్యకర్త సాయంతో దగ్గరలో వున్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. పది కిలోమీటర్ల దూరంలో వున్న మరోఆసుపత్రికి తీసుకెళ్లమని చెప్పడంతో అక్కడికి పరుగెత్తారు. అక్కడికి చేరుకున్న కొద్ది గంటలకే ఆమె మరణించింది. "ఆమె వున్నప్పుడు నా ప్రపంచం కళకళలాడుతుండేది. ఆమెను గురించి మాటల్లో చెప్పలేను. నా పిల్లలను ఎంతో ప్రేమగా, శ్రద్ధగా చూసుకునేది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఒక్కనాడు కూడా ఎత్తి చూపేది కాదు. ఆమె లేకుండా ఎలా బతకాలో అర్థం కావడంలేదు..." అంటాడు రూప్ చంద్ గద్గద స్వరంతో.



పిల్లలతో రూప్ చంద్, ఇన్ సెట్లో భార్య ఫూల్

ఆపరేషన్లను డాక్టర్ రాకేష్ కుమార్ గుప్త చేశారు. ఈయన ప్రభుత్వ సర్జన్‌గా ముప్పయ్యేళ్ల అనుభవజ్ఞులు. ఆపరేషన్ సెంటర్‌లో ఇచ్చిన యాంటీ బయాటిక్స్‌లో ఎలుకలకు పెట్టే విషం జింక్ ఫాస్ఫైడ్ వున్నందున ఈ మరణాలు సంభవించి వుండవచ్చని ఆరోగ్య అధికారుల అభిప్రాయం. ఔషధాలను తయారుచేసే డాక్టర్ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఐదు గంటల్లో డాక్టర్ గుప్త ఎనభైమూడు మందికి ఆపరేషన్లు చేశారని ఒక పత్రిక రాసింది. ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించడమే. రోజుకి ముప్పై ఆపరేషన్లకంటే చేయకూడదని నిబంధనలు చెప్తున్నాయి. అయితే డాక్టరు ఉపయోగించిన కత్తులు, పరికరాలు తుప్పు పట్టినవన్న ఒక నివేదికను గుప్త ఖండిస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన యాభై వేల కుని ఆపరేషన్లు చేసిన అనుభవశీలి. అందుకుగాను ప్రభుత్వం నుంచి అవార్డులు కూడా అందుకున్నారు. సామూహిక మరణాల కేసులో అరెస్టయి కేసు ఎదుర్కొంటున్నారు.డాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఫూల్ బాయి చనిపోయిందని రూప్‌చంద్ వాదన. ఇచ్చిన మందులుగానీ, వాడిన పరికరాలను కానీ ఆయన ఎందుకు సరిగా పరిశీలించలేదనేది అతని ప్రశ్న? ఎవరు ఎంత నష్టపరిహారం అందించినా అది తన భార్యకు సరితూగదని అతని ఆక్రందన.



సంచలన సంపాదకుడు వినోద్

వినోద్ మెహతా మృతితో దేశం ఒక విభిన్న సంపాదకుణ్ని కోల్పోయింది. పాకిస్తాన్ తొలి రాజధాని రావల్పిండిలో 1942లో పుట్టిన వినోద్ మెహతా కుటుంబం దేశ విభజన అనంతరం లక్నోకు తరలి వచ్చింది. పయనీర్ పత్రిక ఢిల్లీ ఎడిషన్‌తో ఆయన వృత్తి జీవితం మొదలైంది. తర్వాత ఆయన రూపొందించిన కొన్ని పత్రికల పట్ల- ముఖ్యంగా 'డిబోనిర్' వంటి వాటి గురించి తీవ్ర విమర్శలే వున్నాయి. కాని 'ఇండిపెండెంట్, సండే అబ్జర్వర్', అంతకు మించి 'ఔట్ లుక్' మ్యాగజైన్ ద్వారా జర్నలిజానికి కొత్త వరవడి పెట్టారనేది నిజం.

నేటికాలానికితగినట్టుసుదీర్ఘంకాకుండాముఖ్యాంశాలు పోకుండా తాజాగా అందించడంలో 'ఔట్ లుక్' నమూనా అందరినీ ఆకర్షించింది. 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా'ను తీర్చిదిద్ది దేశంలో మేగజైన్ పితామహుడనిపించుకున్న కుష్వంత్ సింగ్ కూడా దానికి సంపాదకుడుగా చేయాలని పించిందని రాసుకున్నాడు! నాణ్యమైన ముద్రణ అందమైన పొందికైన లేఔట్ క్లుప్తమైన కథనాలతో 'ఔట్‌లుక్' అలా స్థిరపడిపోవడానికి 17 ఏళ్లు సంపాదకుడుగా సారథ్యం వహించిన వినోద్ మెహతా పాత్ర చాలా వుంది. మతతత్వ రాజకీయాలను ఆమోదించేందుకు నిరాకరించారాయన. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ చర్యలనూ వ్యతిరేకించారు. తను అనుసరించే సూత్రం లౌకికతత్వం అని చెప్పుకున్నారు. 'ఔట్ లుక్' కావడానికి వారపత్రిక అయినా ప్రత్యేక ముఖపత్ర కథనాలను ఇంటర్వ్యూలను ముందే విడుదల చేసి సంచలనం సృష్టించడం పరిపాటి. 'లక్నో బాయ్'గా తన ఆత్మకథ రాసుకున్న వినోద్ మెహతా స్వభావ సిద్ధమైన మొండితనం సాహసం ఇందుకు చాలా వరకు కారణం.

నీరా రాడియా టేపులను వెల్లడించి ఈ నాటి మీడియాపైనా రాజకీయాలపైనా కార్పొరేట్ పట్టును బహిర్గతపర్చడం వినోద్ మెహతా జీవితంలో చెప్పుకోదగిన సంఘటన. ఈ విషయంలో ఆయన అనేక వత్తిళ్లు ఎదుర్కొన్నారు. ఆమె అత్యున్నత స్థాయి లాబీయింగ్‌కు మారుపేరైన 'వైష్ణవి కమ్యూనికేషన్స్' అనే సంస్థ అధినేత్రి. ఆదాయపుపన్ను శాఖ పన్నుల ఎగవేతను అరికట్టే ప్రయత్నంలో భాగంగా నీరా రాడియా టేపులు సంపాదించింది. కొన్ని వేల టేపులలో అనేక సంచలనాంశాలు వున్నాయని ఢిల్లీ వర్గాలలో చాలా కాలంగా ప్రచారం జరిగినా ఎవరూ బయిటపెట్టేందుకు ముందుకు రాలేదు. అలాటి తరుణంలో వినోద్ మెహతా వాటిని సమగ్రంగా ముద్రించి దేశాన్ని ముఖ్యంగా మీడియాను కుదిపేశారు. 2జి కేసు నేపథ్యంలో డిఎంకె మంత్రి రాజాకు టెలికాం శాఖ కొనసాగేలా యు.పి.ఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో మాట్లాడతానని ఎన్.డి.టి.వి కన్సల్టెంగ్ ఎడిటర్ బర్ఖా దత్ రాడియాకు చెప్పడం ఆ టేపులో వుంది.ఇక ప్రముఖ సంపాదకుడు ప్రస్తుతం హిందూస్తాన్ టైమ్స్ సలహాదారు అయిన వీర్ సంఘ్వీ చమురు సహజవాయు నిక్షేపాలకు సంబంధించి రాసిన ఒక వ్యాసాన్ని గురించి నీరా రాడియాకు చెప్పడం వినిపిస్తుంది. 'ఈ వ్యాసంలో పరోక్షంగా నేను రిలయన్స్ వ్యవహారాన్ని తీసుకొచ్చి సమర్థిస్తూ రాశాను. ఈ వాక్యాలు సరిపోతాయి కదా నీరా' అని వీర్ సంఘ్వీ ఆమెను అడుగుతాడు. ఇక పారిశ్రామిక దిగ్గజం టాటా కూడా రాడియాతో కొన్ని అంశాలు మాట్లాడారు. సరళీకరణ యుగంలో మీడియా విస్తరణతో పాటు కార్పొరేట్ శక్తులు రకరకాల లాబీయింగులతో ఎలా పనులు చేయించుకుంటున్నారో ఈ టేపులు తెలియ జేశాయి. అలాగే మీడియా ప్రముఖులు రాజకీ యాల్లో కార్పొరేట్ వ్యవహారాల్లో చేస్తున్న సేవల తీరు కూడా సాక్ష్యాలతో సహా దొరికిపోయింది. ఒక ఒక దశలో టాటా వీటిని విడుదల చేయకూడదంటూ కోర్టుకు వెళ్లారు కూడా.

ఈ కథనం ప్రచురితమైన తర్వాత వినోద్ మెహతా స్నేహితులైన సంపాదకులు పాత్రికే యులు కూడా దూరమైనారు. వారి సమాధా నాలు ప్రచురించేందుకు కూడా వినోద్ సిద్ధమైనారు. సమాచారం కోసమే తాను ఒక వనరుగా నీరా రాడియాతో మాట్లాడానని బర్ఖాదత్ కొంతైనా సమర్థించుకునే ప్రయత్నం చేశారు. వీర్ సంఘ్వీ మాత్రం అది కూడా చేయలేక ఒకటిన్నర ఏడాది సమయం తీసుకుని అవన్నీ నకిలీ టేపులనే వాదనకే పరిమితమైనారు. ఈ సంచలనం తర్వాత వినోద్ మెహతా సంపాదక పదవి కూడా పోయింది. సంపాదక మండలి చైర్మన్‌గా నామకార్థంగా కొనసాగించారు. అయితే అప్పటికే 17 ఏళ్లు అయినందును ఆయనా విచారించలేదంటారు. ఆ తర్వాతనే ఎడిటర్ అన్‌ప్లగ్డ్ అనే పుస్తకం రాశారు. ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని ఇంటర్వ్యూ చేసిన తర్వాత కృతజ్ఞతలు చెప్పడానికి వెళితే మీ పత్రిక నేను తలగడ కింద పెట్టుకుంటాను అని వ్యాఖ్యానించారట. ఆ తర్వాత తనలో చాలా మార్పు వచ్చిందనీ రాజకీయ నేతలతో సంబంధాలకు అంత ప్రాధాన్యత నివ్వడం తగ్గించానని వినోద్ రాస్తారు. వాజ్‌పేయి అల్లుడైన రంజన్ భట్టాచార్య అనేక అవినీతి వ్యవహారాలకు కారణమవుతున్నాడని 'ఔట్‌లుక్' పత్రికలో కథనం ప్రచురించారు. ఆ తర్వాత ఆ పత్రికపైన ఆదాయపు పన్ను దాడులు బాగా పెరగడమే గాక అనేక వేధింపులూ కొనసాగాయి. యజమాని అభ్యర్థనపై వినోద్ మెహతా ప్రదాని వాజ్‌పేయికి ఒక లేఖ రాస్తే స్పందన రాకపోవడం బాగా ఆగ్రహం కలిగించింది. వాజ్‌పేయికి భారత రత్న ఇవ్వడం కూడా సరికాదని ఆయన వ్యాఖ్యానించారు.

ఆయన తన కుక్క పిల్లకు ఎడిటర్ అని పేరు పెట్టుకున్నాడు. సంపాదకుడు వాచ్ డాగ్‌లా పని చేయాలని చెప్పే సంకేతం అందులో వుంది. తన కాలమ్స్‌లో తరచూ ఎడిటర్ పేరిట ఈ కుక్కపిల్ల గురించిన ప్రస్తావనలు చేసేవారు. పోటోలు ముద్రించేవారు. వ్యక్తిగానూ ఆయన రచనా శైలి, అధ్యయనం, పాత్రికేయ ప్రమాణాలు చెప్పుకోదగినవిగా కనిపిస్తాయి. తన పుస్తకాల్లో ఆయన మీడియాకు సంబంధించిన అనేక లోగుట్లు బయిటపెట్టారు. అదే సమయంలో తనకు బాగా ఇష్టమైన వ్యక్తులుగా కె.ఎ.అబ్బాస్, రష్కిన్ బాండ్ వంటి వారి గురించి చాలా చక్కగా రాశారు. సంజయ్ గాంధీ, మీనా కుమారి జీవిత కథలు రాశారు. 'హౌ క్లోజ్ యు టు ద ప్రైమినిస్టర్' అన్న పుస్తకంలోనూ చాలా విశేషాలున్నాయి.

వినోద్ మెహతా భార్య సుమితా పాల్ కూడా జర్నలిస్టుగా వున్నారు. వారికి సంతానం లేదు. తనకు వివాహానికి ముందు ఒక మహిళ వల్ల అమ్మాయి కలిగినట్టు వినోద్ మెహతా బహిరంగంగా రాసుకున్నారు. భార్య ఆమోదంతో ఆ బాలికకు బాధ్యత వహించినట్టు కనిపిస్తుంది. వినోద్ మెహతా మృతిపట్ల అసాధారణ రీతిలో సంతాపం వ్యక్తమైందంటే ఆయన ప్రతిభా వ్యక్తిత్వాలే కారణం.

-తె.ర

రోబోలకు అంతిమ సంస్కారం

అయిన వాళ్ళు చనిపోతే అంతిమ సంస్కారాలు చేయడం ఎక్కడైనా వుంది. పోనీ పెంపుడు జంతువులు మరణిస్తే చేసేవారూ వున్నారు. ఇదేంటీ రోబోలకూనా! అనుకుంటే...అవుననే చెప్పుకోవాల్సి వస్తుంది. ఈ వింత జపాన్‌లో చూడొచ్చు. జపనీయులు తాము పెంచుకున్న రోబో శునకాలు విరిగిపోతే ... అవి చనిపోయినట్టుగా భావించి అంతిమ కార్యక్రమాలు చేసేస్తున్నారు. ఇదేంటి విచిత్రంగా! ఎక్కడైనా రోబో విరిగిపోతే బాగు చేయిస్తారు కానీ ... ఇదేంటి? అనిపించొచ్చు. నిజానికి ఆ రోబో కుక్కలను సోనీ కంపెనీ తయారుచేసేది. మొట్టమొదటిసారిగా ఐబో కుక్కలను 1999లో తయారుచేసింది. వాటికి విపరీతమైన గిరాకీ వచ్చింది. అయితే 2006లో సోనీ పరిస్థితి అంత బాగాలేక ... ఐబో రోబోల తయారీని ఆపివేయాలని నిర్ణయించుకుంది. అంతే కాక ఐబో రిపేర్ సెంటర్లను మూసేయాలనుకుంది. ఇక్కడే వచ్చింది చిక్కు. మరి ఆ రోబోలను కొనుక్కున్నవారికి సమస్యలు అప్పుడే మొదలయ్యాయి. బొమ్మలన్నాక విరక్కుండా వుండవు కదా. తీరా విరిగితే వాటి స్పేర్ పార్టులు దొరికే షాపులను కనిపెట్టడం పెద్ద సమస్య అయ్యింది. దాంతో వాటికి అంతిమ సంస్కారాలు చేసేసి ఒక కన్నీటి బొట్టుతో కూడిన నిట్టూర్పు విడుద్దామనుకున్నారు జపాన్ వాసులు. అయితే అన్ని రోబోలు ఒకేలా వుంటాయి కదా. ఎవరిది ఏదో ఎలా తెలుస్తుంది? అంటే ప్రతి రోబో బొమ్మకు ఒక ట్యాగ్ కడుతున్నారు. దానిమీద రోబో పేరు, యజమాని పేరు, ప్రాంతం పేరు రాస్తున్నారట. ఇదండీ! రోబో అంతిమ సంస్కారాల కత!

మార్కెట్‌లో మంచు

వ్యాపారస్తుణ్ణి సముద్రంలో వదిలినా బిజినెస్ చేస్తాడనడానికి చక్కటి ఉదాహరణ మన ముందు వుంది. ఇదిగో ఇతగాడి పేరు కైల్ వారింగ్. అమెరికా వాసి. బోస్టన్‌లో విపరీతంగా మంచు కురుస్తున్న సంగతి తెలిసిందే కదా. విపరీతంగా అంటే ఎంత అంటారేమో! ఆ ... ఎంత? 8.3 అడుగుల ఎత్తే. ఆ మంచును ... అమెరికాలో అంతగా మంచు కురవని ప్రదేశాల్లో అమ్మితే ఎలా వుంటుంది అన్న ఆలోచన చేశారు కైల్. అనుకున్నదే తడవుగా మంచును ఎంచక్కా ప్లాస్టిక్ బాటిళ్లలోకి ఎత్తి...ప్యాక్ చేసి ఎగుమతి చేయడం మొదలెట్టాడు. ఎంతకీ అంటారేమో! పెద్ద ధరేం కాదులెండి? సీసా మంచు 20 డాలర్లే. ప్రస్తుతానికి మంచు వ్యాపారం బానే నడుస్తోందట.



పదిహేనేళ్లకే 'నానీ' బిజినెస్

పిల్లలను దగ్గరుండి చూసుకునే వీలు లేని తల్లిదండ్రులు వారిని క్రచ్‌ల్లో వేయడం చూస్తుంటాం. అదే అమెరికాలో అయితే ఆ పిల్లలను ఇంటికే వచ్చి చూస్తుంటారు. వాళ్లనే 'నానీ' అంటారు. అవసరమైన వారికి ఈ నానీలను ఏర్పాటు చేసే వ్యాపారాన్ని విజయవంతంగా చేసేస్తోంది పదిహేనేళ్ల నోవా మింట్జ్. ఇంతకీ ఈ ఐడియా ఎందుకొచ్చింద నుకుంటున్నారు? స్వయానా నానీల బాధితులరాలు కాబట్టి. అంటే తనను చక్కగా చూసుకునే నానీలు దొరక్క నోవా బాగా ఇబ్బందులు పడిందట. అందుకే తనలా మరెవరూ నానీల సమస్యతో బాధ పడకూడదని... ఏకంగా 'నానీస్ బై నోవా' అనే సంస్థను ప్రారభించేసింది. ముం దుగా తనకు తెల్సిన వారికి, ఇరుగుపొరుగుకు, స్నేహితులకు, బంధువులకు నానీలను ఏర్పాటు చేసేది. ఆ తర్వాత ఇటు నానీల నుంచి, అటు నానీలు కావాల్సిన వారి నుంచి ఫోన్లు, మెయిళ్లు రాసాగాయి నోవాకు. ఇంకేముంది. ఒక్కో మ్యాచి కుదిర్చి నందుకు వంద నుంచి 200 వరకు డాలర్లు పుచ్చుకోవడం మొదలెట్టింది. అయితే ఇంకా స్కూలు చదువు పూర్తి కాకపోవడంతో... బిజినెస్ చూసుకోవడానికి ఒక సి.ఇ.ఒను ఏర్పాటు చేసుకుంది. పాఠశాల విద్య పూర్త య్యాక... బిజినెస్ గురించి సీరియస్‌గా ఆలోచిస్తుందట.



ఎంపు

కుంటాడి కావేళ జోలి నిండిపోయింది. జోలితో జోలెడు ముష్టి, అంటే రెండు కుంచాల బియ్యం. రేపటి చింతలేని బతుకైనా తొడకి బరువుగా తగుల్తూ, జోలి వేళాడుతూ ఉంటే కుంటాడి ప్రాణం సంతుష్టితో సుఖపడ్డాది. పది రోజుల గ్రాసం వాడి భుజాన్ని దిగలాగుతూ వేళ్లాడుతున్నాది. కుంటాడు కాలెగరేస్తూ ఊరవతల తోటల్లోకెళ్లాడు. నెల్లాకు ఎండుపుల్లలు ఏరుకున్నాడు. మూడు మామిడి పింజలు దొంగిలించాడు. సాయంకాలానికి సత్రపు అరుగులు చేరుకున్నాడు. మూటలో మట్టిపిడత తీశాడు. మూడు రాళ్ల మధ్య నిప్పు చేసి అన్నం ఎసరు పెట్టాడు. ఎర్రగా పొయ్యి నిండా లేచింది మంట. చలిలో చుట్టుకుపోయిన కుంటాడి శరీరం వెచ్చబడ్డాది.

"ఎర్రీ!" అని కేక పెట్టాడు. సత్రపు అవతల వరండాలో ఎర్రి, దాని కుష్టు రోగపు తండ్రి కాపరముంటున్నారు. ఎర్రి వొచ్చింది.

"పులుసు దాకోపాలి ఇద్దూ!" అన్నాడు.

"ఏం పులుసురో?" అన్నాది ఎర్రి.

"ఏం పులుసునే. మావిడికాయ నెల్లాకు"

"ఉన్ననాడూ తినవా? ఎదవ నెల్లాకు. సేపలైనా కొన్నా! నానైతే మాంసం కొందును"

"అమ్మో గింజలైపోవు? ఆటితో నేను పదేను రోజులు బతకాలి!"

"రేపు తిరిపెమెత్తవా? జానడు పొట్టకేటోరె? మూడు పిడికిళ్లు దొరికితే సాల్దూ? కొన్నా సేపలు!" అని బలవంత పెట్టింది.

దాని మాటలో ఉన్నాది ముష్టివాళ్ల ఆర్థిక రహస్యం. మూడు పిడికిళ్లు దొరికితే చావకుండా బతకొచ్చు. నలుగురమ్మలకి దయగలిగితే పొట్ట నిండిపోతుంది. అదీ ముష్టివాళ్ల ధీమా! కుంటోడు లేచాడు. ముసిల్దాని కొట్టుకెళ్లాడు. ముసిల్ది ముష్టి ముసాఫర్లకి కిరాణి సామానులు కూరలు, కంపకట్టలూ అమ్ముతుంది. సోలడు నూకలు వెలపుచ్చుకుని నాలుగెండు చేపల్తోసహా పులుసు సామానిచ్చింది. ఎర్రి పులుసుదాక తెచ్చింది.

* * *

ఆ రాత్రి చీకట్లో కుంటాడు ఎర్రిని పట్టుకొని చెడ్డ బతిమాలేడు. తనూ వాళ్లతో వుండిపోతానని. తనకీ గంజినీళ్లు పోస్తూ ఉండమనీ, తన్ని పెళ్లాడమనీ పెద్ద పట్టుపట్టేడు. ఎర్రి మెత్తబడ్డాది. మర్నాడు ఎర్రి సొట్టాడు కలిసి వొండుకుంటున్నారు. ఎర్రి సేపలపులుసు మళ్లా పెట్టింది. సత్రవులో అందరి ముక్కులూ ఎగరగొట్టింది పులుసువాసన. జ్వరంతో పడుకున్న ముసిలాడు లేచాడు.

"ఈ డెవడు?" అనడిగాడు.

"ఇక్కడున్న సొట్టాడే!" అన్నాది ఎర్రి.

"ఎందుకొచ్చినాడూ?"

"కలిసి వొండుకుంటున్నాం"

"కలిశా?"

"ఔను మామా. కలొసుకున్నాం" అన్నాడు సొట్టాడు. ముసిలాడు ఎర్రగా చూశాడు.

"ఎళ్లవతలకి సెత్త ఎదవా!" అన్నాడు ముసిలాడు.

"ఎందుకలా కసురుతావు? నానంత సెడిపోయినోణ్ణి కాను" అన్నాడు సొట్టాడు.

"ఒరెరుగుదునెర్రా జాత్తక్కువ ఎదవా!" సొట్టాడు పిచ్చెత్తిపోయాడు.

"నాకా జాత్తక్కువ? నాను కాపోళ్ల కుర్రోణ్ణి. ఏటనుకున్నావో! ఆఁ నీ కూతురు గొప్పయిపోనేదు. జటకావోడితో పోయిన సెటకారీ. ఆ జటకావోడు జొన్నగుడ్డోడు!" అన్నాడు సొట్టాడు.

ముసిలాడు లేచి పులుసుదాక కాల్తో తన్నేడు. పెద్ద అల్లరి అయిపోయింది. ముష్టివాళ్లంతా మధ్య పడ్డారు. సొట్టాడు కుంటుకుంటూ వెళ్లిపోయాడు.

"ఈ ఎదవా దొరికినాడు నీకు? సరియైన వోణ్ణి నానే సూత్తాను" అని ఎర్రికి చెప్పి ఎక్కడికో వెళ్లి పోయాడు.

సొట్టాడు మళ్లీ వొచ్చేడు.

"మీ యయ్య మాటలు ఇన్నావా?" అనడిగాడు.

"నా నేటిసేతును?" అన్నాది ఎర్రి.

"నువ్వు సెయ్యగలిగింది నువ్వు సెయ్యాల!"

"ఏటి సెయ్యమంటావు?"

"నాతోరా!"

"ఎక్కడికి?"

"ఎక్కడికేటి? రామేశ్వరం దరినుంచి అద్దుమాలిన రాజ్జం"

"ముసిలాడు?"

"ఆడేడుపాడేడుస్తాడు!"

'అంటే?"

"ఒగ్గేద్దాం!"

"అమ్మ గుండె తీసినోడా! రోగిష్టివోణ్ణి వొగ్గేసి నీతో కులుకుతూ రమ్మంతావూ?"

“నీ కిష్టమైతేనే!”
“ఎళ్లెళ్లు” అని కసిరి కొట్టింది. ఎర్రి కెదురుగా
గోడ మూల గోనె కప్పుకుని గొంగళి
పురుగులాగు చుట్టుకుని సొట్టాడు
పడుకున్నాడు. ఎర్రి దాకలో అన్నం గంజి వేసి
నంచుకోడానికి నాలుగు మిరపకాయలు పెట్టి
సొట్టాణ్ణి లేపింది.
“తిండి తిన్రా! మళ్లా మా యయ్యొస్తే జట్టీ”
“నాను తిన్ను” అన్నాడు. ఎర్రి ఎంత
బతిమాలినా లేచాడు కాదు.
ముసిలాడు వచ్చేడు. వాడితో పాటు గుడ్డివాణ్ణి
ఒకణ్ణి తీసుకొచ్చాడు.
“ఎర్రీ!” అని కేకేశాడు. ఎర్రి పలికింది.
“ఇయ్యాళ నుంచి నువ్వ ముగ్గురికి గంజినీళ్లు
ఉడకెయ్యాలి. తెలిసిందా? ఆఁ? ఈ
గుడ్డోణ్ణెరగవూ?”
ఎర్రి గుడ్డివాణ్ణి ఎరుగు. వాడితో వాళ్లు
శ్రీకూర్మం డోలాయాత్రకెళ్లారు. “ఎర్రీ బాగున్నా?”
అని కుశలమడిగేడు గుడ్డివాడు.
“ఏం బాగునే? ముసిలాడు మూలపడ్డాడు.
అన్నాది ఎర్రి.
“పెద్దోడయ్యాడు” అన్నాడు గుడ్డివాడు.
“అనాగేనే” అన్నాది ఎర్రి.
‘ఎర్రీ ఇయాళనుంచి నువ్వు ముగ్గురికి గంజినీళ్లు
ఉడకెయ్యాలి” అన్నాడు ముసిలాడు.
ఎర్రికి మతి పోయింది. పెంచి పెద్దదాన్ని చేసిన
తండ్రి శుభ్రమైన కుంటాడు దేహీ అని కాళ్ల
దగ్గరుంటే గెంటేసి గుడ్డివాడికి కట్టిపెట్టడానికి
పూనుకున్నాడు. ఎర్రికి బోధపళ్లేదు.
ఏమిలాభం? కాదండానికి వీల్లేదు. తండ్రి
చెప్పినట్లు నడుచుకోక తీరదు. సత్రపు
పంచమూలని కుక్కలాగ చుట్టుకుని కుంటాడు
పడుకున్నాడు. తిండి తిన్నాడు కాడు. వాడు
అడుక్కుతెచ్చిన బియ్యం పెట్టి ఎర్రి వంట
చేసింది. ఎర్రి దిగాలు పడిపోయింది.
“ఎర్రీ! నువ్వు ఎర్రిదానివి. నిజంగా ఎర్రిదానివి”
అన్నాడు ముసిలాడు. ఎర్రికి ఏడుపు వస్తున్నాది.
“ఇలారా ఎర్రీ! అని ముసిలాడు దాన్ని దూరంగా
తీసుకువెళ్లాడు.
“సూసినావా గుడ్డోణ్ణి?” అనడిగాడు. చూడకేం.
ఎర్రికి అదివరకే తెలుసు. నల్లగా రాయిలాంటి
వొళ్లు. నుదురునిండా మెరిసిపోతూ నామం!
పేలిన పత్తికాయల్లాగ కిందికి జారిపోతూ గుడ్లు
భయమేస్తూ గుడ్డివాడుంటాడు.
“ఆఁ సూసినాను” అని తొడలు
వాయించుకుంది.
“నీకు సొట్టోడి మీదున్నాది” అని వెక్కిరింపు
నవ్వు నవ్వాడు.
“నా కెవడిమీదా నేదు” అని శూన్యాన్ని
చూసింది.

“అనాక్కాదు సెప్పు”
“నాకు తెల్దు”
“నీకు సొట్టాడు కావాలి”
“నీ యిష్టమే కానీ”
“అనాగన్నావు బాగుంది. అది నోకం
మెచ్చినమాట. నాను సెప్పినాను ఇనుకో”
అన్నాడు ముసిలాడు. ఇనుకోక తప్పుతుందా?
నిల్సో అంటే నిల్సోవాలి. వాడితో వెళ్లు అంటే
వెళ్లాలి. మనసా ఇష్టంలేని పెళ్లి కూడా
వొద్దంటానికి అవకాశం లేదు. తిరుగుబాటు
చేయడానికి సత్తువ లేదు. చావడానికి సిద్ధంగా
ఉన్న ముసిలి కుష్టురోగపు తండ్రితో ఏమున్నాది!
పెంచిన తల్లిదండ్రులకి ఆ అధికారం ఒక్కొక్క
పిల్లపైని ఉన్నాది. ఉన్నాది ఒకొక్క పిల్లకి
తల్లిదండ్రులపైనా గౌరవం.
“ఇనుకోక కాదన్నావా?” అన్నాది ఎర్రి.
‘ఆడికీ ఈడికీ తేడా సెప్పు?” అని అడిగాడు.
“సొట్టోడు సక్కనాగున్నాడు. గుడ్డోడు
భయమేస్తున్నాడు”
“నాను భయమేస్తూ నేనూ? కుష్టురోగిని.
నన్నెలాగ చూస్తున్నావు? నాకెలాగ
సేస్తున్నావు?”
“బాగుంది తండ్రివి”
“నాను తండ్రినని ఇష్టపడ్డావా? ఆడు మొగుడని
ఇష్టపడు. సేస్తూ ఓ కాడ ఉంటే అదే
ఇష్టమౌతుంది. సోట్టాడితో ఇంతకీ దినం ఎళు
తుందా?”
“ఎందుకెళ్లదు?”
“ఎనాగెళుతుంది?”
“మూడు పిడికెళ్ల ముష్టి దొరకదా?”
“అదిగక్కడే నాను సెపుతున్నాను. ఇనుకో?!”
అని ముసిలాడు పెద్ద బోధ చేశాడు. ముసిలాడు
ఉపన్యాసం ముష్టిలోకానికి ఉపనిషత్తు.
“ఈ ముసిలాడు సచ్చీ కాలానికి నన్నద్దానం
చేశాడని నువ్వేడవకు. సొట్టాడితోటెళ్లినావా. నీకు
కూడునేదు. ఆలకించి యాదస్తుంచుకో! ఇవాళ
సెప్పినది మళ్లీ పుష్కరానికి సూసుకో. సొట్టాడు
ఏ గుమ్మమెక్కినా మొహంమీద భడీమని తలుపు
ఏసుకుంటారు. ఆడి మొకం సూస్తే ముష్టి
పలకదు. ఆడు నిన్నట్టుకు బతుకుతాడు.
నిన్నాడికీ ఈడికీ కుదిరిసి ఆడు బతుకుతాడు.
గుడ్డోడు మారాజు. కళ్లనేని కబోది. ఆడు
జనమ కదొక్కటే శాన ఆణ్ణి చూస్తే
జాలిపుడతాది. ఏ యమ్మేనా మనసు కరిగి ఇన్ని
గింజలేస్తాది. అతంతా ఎందుకు? ఆడు
అద్దుమాలిన పాటగోడు. ఆడి కెన్నెన్ని
పదాలొచ్చును. ఆణ్ణి సెయ్యట్టుకుని తీసికెళ్లి
నాలుగు రోడ్లమధ్య నోవార కూకోయెట్టి
ఆడిముందల గుడ్డి వరిసి నువ్వెళ్లి పో. ఆడు
సితార పట్టుకుని వోయిస్తూ పాడినాడంటే

రూపాయి డబ్బులికి నాగారాదు. నీకదే దాకలా.
“మనిషిని సూసినావా? గునపం నాగున్నాడు.
నానాగ పెద్ద రోగం. మొండిసేతులూ నేవు.
జిర్రని సీదడు. ఇంత తెస్తాడు. ఇంత తింటాడు.
నీమీద ఆధారపడి నీ సెప్పుసేతల్లో ఉంటాడు.
నువ్వెక్కిడికి యెళ్లినా అడిగినోడు కాదు.
సూడరాడు. నీకు మనుసయిందీ,
ఇష్టమొచ్చినట్టు తిరుగు. తఖరనేదు...
ఏవంటావు?” అనడిగాడు తండ్రి.
“నా నేటంటాను?” అన్నాది ఎర్రి.
“అనాక్కాదు. ఆణ్ణి వొగ్గకు. నాను బతికుండగా
సెప్పుతున్నాను”
“సరేనే పద”
“ఈ బైరేగి సిటికి అందరికీ తెల్దు. నన్నడిగితే
ముష్టిగుంటలంతా ఎతికి ఎతికి గుడ్డోళ్లనే
కట్టుకోవాలి”
“పద”
ఇద్దరూ సత్రపు అరుగుమీదకెళ్లారు.
“ఒరే గుడ్డీ! ఎర్రి ఒప్పుకుంది. అదింకో
మాటందు” అని ముసిలాడు సెప్పేడు.
గుడ్డివాడు పొంగిపోయాడు. వాడి జన్మకి
ఎర్రిలాంటి గుంట ఆ జన్మాంతం దొరకడమే
భాగ్యం.
“ఎర్రీ ఇంద. ఇందునోవి తీసి రేపు కడేలూ,
అందేలూ కొనుక్కో” అని గుడ్డివాడు
మొలగుడ్డల్లో పైకి కనపడకుండా దాచుకొన్న
ముంతంత డబ్బులమూట పైకి తీశాడు.
కాసులు, దమ్మిడీలు ఎన్నాళ్లబట్టి కూడబెతున్నవో
ముంతంత మూటని చేశాడు. అన్ని డబ్బులు ఏ
ముష్టి వాడి దగ్గరున్నాయి? ఎర్రి కళ్లు
చెదిరిపోయాయి.
“నాకు మెళ్లోకి ఎర్ర పూసలు కావాలి” అన్నాది.
ఎర్రికి ఎర్ర పూసలు ఎన్నాళ్లనుంచో మనసు.
“అయి కొనుక్కో! కానీ సిలవరు కడేలు,
అందెలూ కొను. కడేలూ, గాజులూ నేకపోతే
ఆడదానికీ, మొగాడికీ ఏటి తేడా? కడేలు, సెడ్డ
అందం” అన్నాడు గుడ్డివాడు. కళ్లు లేనివాడికి
కడియాల రవ్వలూ గాజుల మోతలే కాబోలు
కామాన్ని కదుపుతాయి!
“ఇంక నెగండి కూడు తిని తొంగుందాం”
అన్నాడు ముసిలాడు. ఎర్రి ముగ్గురికీ సర్దింది.
మూకుడుతో కూడు పెట్టి గంజి నిండా పోసి
గుడ్డివాడికందించింది.
“మా యమ్మకదూ! అద్దిగలాగ ఆడికి దినం
ఎళ్లనీ. నీ సేత్తో ఆడికింత ఎట్టు. ఇద్దరూ నా
దినం సచ్చీదాక ఎళ్లనీయండి. ఎర్రీ నాను
బతికుండగా సెపుతున్నాను, గుడ్డోణ్ణి వొగ్గకే?”
అన్నాడు ముసిలాడు.

- చాసో

ఏ తోపుడు బండిలోనైనా కూరగాయలో, పండ్లో ఉంటాయి. కాని ఆ బండిలో కూరగాయలు లేవు. పండ్లు లేవు. బండి నెట్టే అతను మాత్రం చాలా హుందాగా కనిపిస్తున్నాడు. ఇంతకీ ఎవరతనూ...ఆ బండిలో ఏమున్నాయబ్బా....అని దాన్ని చూసే ప్రతి ఒక్కరికీ ఏదో కుతూహలం. "ఒక్కసారి పుస్తకాన్ని తాకండి. మనకు తెలియని ఒక భావన కలుగుతుంది. మనసు ఉత్తేజంతో పరవళ్ళు తొక్కుతుంది. ఒక్కసారి పుస్తకాన్ని తాకి చూడండి". అంటూ పుస్తకాలను బండిపై పెట్టుకొని తోసుకుంటూ వెళుతున్నాడు అతను. వాస్తవానికి ఇది అతని వృత్తికాదు. ఆసక్తి మాత్రమే. పుస్తకాన్ని గడపగడపకు చేర్చడం ఆయన లక్ష్యం. హైదరాబాద్ నగర వీధుల్లో ఇప్పుడు పుస్తకాలు సంచరిస్తున్నాయి. ఇంటింటికి కూరగాయలు చేరడం ఎంత ముఖ్యమో పుస్తకం చేరడం కూడా అంతే ముఖ్యం అంటున్నారు. ఆయన తోపుడు బండి పేరుతో ప్రతి ఇంటికీ పుస్తకాన్ని చేర్చే ఆయన ప్రయత్నాన్ని ప్రతి ఒక్కరూ హర్షిస్తున్నారు. కవిత్వంపై తనకున్న అమితమైన ఆసక్తితో కాలినడకన తిరుగుతూ ప్రతి ఒక్కరి వద్దకు ఆ కవిత్వాన్ని అందుబాటులోకి తెస్తూ **షేక్.సాదిక్** కాస్త 'తోపుడుబండి సాదిక్' గా మారిపోయారు. ఆయనతో 'స్నేహ' సంభాషణ....

'తోపుడుబండి'తో ఇంటింటికి కవిత్వం

మీకు తోపుడు బండి ఆలోచన ఎలా వచ్చింది?
నేను కవిసంగమం ఏర్పడిన నాటినుండి కవిత్వంపై ఆసక్తి పెరిగింది. ఎన్నో భావాలను చిన్న కవిత్వంలో చెబుతారు. దాంతో కవిత్వంపై తెలియకుండానే విపరీతమైన అభిమానం కలిగింది. నవలలతో పాటు కవిత్వానికీ ప్రాధాన్యం ఉంది. కాని నవలలు చదివినంతగా కవిత్వానికి సంబంధించిన పుస్తకాలు అమ్ముడుపోవడం లేదు. దీనికి పరిష్కారం ఏమిటని చాలా ఆలోచించాను. హైదరాబాద్, విజయవాడ బుక్‌ఫెయిర్‌లకు వెళ్ళి వచ్చిన తర్వాత ఈ ఆలోచన వచ్చింది. మంచి కవిత్వం గడప గడపకూ చేరాలనే ఈ ప్రయత్నం ప్రారంభించా.

శ్రీశ్రీ తర్వాత కవిత్వానికి ఆదరణ ఉందంటారా?
కచ్చితంగా ఉంది. తోపుడు బండిపై పుస్తకాల కొనుగోలు చూస్తేనే అర్థమవుతుంది. తరం మారుతున్న కొద్దీ యువత ఆలోచనలు మారతాయి. వారి ఆలోచనలకు తగిన కవిత్వం వస్తుంది. యువత వారి అభిరుచులకు తగిన కవిత్వాన్ని కచ్చితంగా ఆదరిస్తున్నారు. చదువుతున్నారు.

1980 తర్వాత కవిత్వానికి కాస్త ఆదరణ తగ్గిందని...
అది కూడా వాస్తవమే. గతంలో కవిత్వం ఎక్కువ మంది రాసేవారు, చదివేవారు. ఆ తర్వాత మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పుస్తకాల్లో మార్పులు వచ్చాయి. ఎక్కువ మంది పబ్లిషర్స్, డిస్ట్రిబ్యూటర్స్ వ్యక్తిత్వ వికాసం, నవలలపై ఎక్కువగా దృష్టిపెట్టారు. ఎందుకంటే అవే ఎక్కువగా అమ్ముడు పోతున్నాయి. దాంతో కవితలు రాసే వారు వారి పుస్తకాల ముద్రణకు అవకాశం లేక రాయడం కాస్త తగ్గింది. కాని కవిత్వం ప్రజలందరి దగ్గరకు వెళ్ళాలి. అప్పుడే రాసేవారికి ప్రోత్సాహం దొరుకుతుంది.

ఐతే తోపుడు బండి ద్వారా కవిత్వానికి పూర్వ వైభవం వస్తుందంటారా?
రావాలనే కోరిక. మా వంతుగా ఒక ప్రయత్నం ప్రారంభించాం. కవిత్వానికి ఆ వైభవాన్ని తీసుకురావడానికి జరిగిన మొదటి ప్రయత్నం



కవిసంగమం, రెండవది తోపుడు బండి. ఇలా మా తర్వాత కూడా కవిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఎవరో ఒకరు కచ్చితంగా ప్రయత్నిస్తారు. ఆ నమ్మకం మాకు ఉంది.

పుస్తకాలు అమ్మడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. మరి దీన్నే ఎందుకు ఎంచుకున్నారు?

పుస్తకాలు అమ్మడం నా వృత్తి కాదు. కేవలం కవిత్వాన్ని ప్రజలందరి దగ్గరకు చేర్చాలనే నా కోరిక. కవిత్వానికి ఆదరణ పెరగాలి. తెల్లవారితే ప్రతి ఇంటి వద్దకు తోపుడు బండిపై కూరగాయలు అమ్మేవారు వస్తారు. శరీరక ఆరోగ్యానికి తిండి ఎంత అవసరమో మానసిక ఆరోగ్యానికి పుస్తక పఠనం కూడా అంతే అవసరం. అందుకే ప్రతి ఇంటికి కూరగాయలు చేరినంత తేలిగ్గా పుస్తకాలు కూడా చేరాలని నా ఈ ప్రస్థానానికి తోపుడుబండి అనిపేరుపెట్టాను.

మీ తోపుడు బండికి పెద్దల సహకారం ఏమైనా ఉందా?

చాలా ఉంది. నాకు ఈ ఆలోచన వచ్చిన వెంటనే నా మిత్రులు యాకూబ్, వాసిరెడ్డి గోపాల్‌లను సంప్రదించా. నా ఆలోచనకు వారి సహకారం తోడయింది. తోపుడు బండి పేరుపెట్టమని సలహా ఇచ్చింది కూడా వారే. చాలా మంది కవులు మంచి కవిత్వాలు రాస్తున్నారు. కాని అమ్ముడుపోక ఇబ్బందిపడుతున్నారు. తాము ముద్రించిన పుస్తకాలను కాంప్లిమెంటరీలుగా ఇచ్చేస్తున్నారు. పబ్లిషర్స్ ఎక్కువగా పెద్దవాళ్ళకు మాత్రమే సహకరిస్తారు. కొత్త రచయితలకు తాము రాసిన పుస్తకాలకు ఆదరణ ఉండడం లేదు. అందుకే అటువంటి వారి కవిత్వాని మా తోపుడు బండిలో అటువంటి వారి కవిత్వానికి ప్రాధాన్యం ఇస్తున్నాం.

మరి ప్రజల్లో స్పందన ఎలా ఉంది?

చాలా బాగుంది. వాస్తవానికి దీన్ని ప్రారంభించేటపుడు ఇంత స్పందన ఉంటుందని అసలు అనుకోలేదు. కవులు తమ పుస్తకాలను బండి ఎక్కడ ఉంటే అక్కడకు వచ్చి తమ పుస్తకాలను ఇచ్చి వెళుతున్నారు. రోడ్డుపై బండి నెట్టుకొని వెళుతుంటే అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఆగి మరీ పుస్తకాలను కొంటున్నారు. విద్యార్థులు, యువత బాగా స్పందిస్తున్నారు. స్కూలు పిల్లలకు తల్లిదండ్రులు పుస్తకాలు కొనిస్తున్నారు. ఇది ఒక మంచి పరిణామం. పిల్లలకు పుస్తకాలు కొని చదివించడం ద్వారా వారిలో మంచి భావాలు ఏర్పడతాయి. ఎక్కువగా భావ కవిత్వం తీసుకోవడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా 144 మంది కవులు రచించి,

కవిసంగమం వారు వేసిన పుస్తకానికి ఆదరణ బాగుంది.'జీజభూమి' యాభై కాపీలు, 'రంగులు మాయని సీతాకోక చిలుక', 'మాకు ఒక భాష కావాలి' పుస్తకాలు వంద కాపీల వరకు అమ్ముడుపోయాయి. అరుష్‌సాగర్ కవిత్వం విస్తృతంగా అమ్ముడుపోతుంది. దాదాపు అన్ని రకాల కవిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నాను. ప్రస్తుతం 160టైటిల్స్ తోపుడు బండిలో ఉన్నాయి. వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

మహిళా కవయిత్రుల పుస్తకాలకు ఆదరణ ఎలా ఉంది?

ముందే చెప్పినట్లు కవిత్వాలు రాసింది పురుషుడైన, స్త్రీ అయిన ఆదరణ పెద్దగా లేదు. అందుకే ఈ తోపుడు బండి ఉద్యమం ప్రారంభ మయింది. గతంలో కవిత్వాలు రాసే మహిళలు చాలా తక్కువగా ఉన్నారు. ఇప్పుడు వారి సంఖ్య కూడా పెరిగింది. తోపుడు బండిలో కవయిత్రిల పుస్తకాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చాం.

మీ తోపుడు బండి ప్రస్థానం ఎక్కడ నుండి ప్రారంభించారు?

ఫిబ్రవరి 22న ఈ బండి రోడుపైకి వచ్చింది. రోజుకు 20 నుండి 30 కిలో మీటర్ల వరకు సాగుతోంది. మొదట రాంనగర్ గుండు నుండి ప్రారంభమయింది. ఆర్‌టిసి క్రాస్ రోడ్, విఎస్‌టి, జవహర్‌నగర్, గాంధీనగర్, దోమల గూడ, బుద్ధ పూర్ణిమ, నక్లెస్‌రోడ్ మీదుగా హైదరాబాద్ నగరం మొత్తం తోపుడు బండి వెళుతుంది. రోజులకు సుమారుగా 200 పుస్తకాలు అమ్ముడుపోతున్నాయి.

మీ తోపుడు బండి ఇతర జిల్లాలకు ఏమైనా వెళ్ళే అవకాశం ఉందా?

కచ్చితంగా వెళుతుంది. ఈ పాటికే చాలా జిల్లాల నుండి ఫోన్లు వస్తున్నాయి. అనంతరపురం, ఖమ్మం, కామారెడ్డి, వైజాగ్, భీమవరం వారు తమ జిల్లాలకు రమ్మని అడుగుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రతి జిల్లా కేంద్రంలో, ప్రధాన పట్టణాలలో ఈ తోపుడు బండి వెళుతుంది. అయితే ఇదే బండి అక్కడకు వెళుతుందా...లేక ఎవరి జిల్లాల్లో వాళ్ళు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటారా అనేది ప్రణాళిక రూపొందించు కోవాలి. నేను మాత్రం పూర్తిగా రెండు మూడు సంవత్సరాల వరకు ఇదే కార్యక్రమాన్ని కొనసాగించాలనుకుంటున్నా.

అసలు మీ గురించి చెప్పనే లేదు...?

మాది ఖమ్మం జిల్లా. కల్లూరి గ్రామం. స్కూలు చదువు మొత్తం జిల్లాలోనే. పిజి చేయడానికి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చాను. వివిధ పత్రికల్లో చాలా కాలం జర్నలిస్టుగా చేశాను. తర్వాత చాలా బిజినెస్‌లు పెట్టాను. నా భార్య ఉష. అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తుంది. డబ్బుకు కొదవ లేదు. అందుకే ప్రత్యేకంగా ఈ పని చేయడానికి ఎటువంటి ఆర్థిక ఇబ్బందీ లేదు.

కవిత్వాన్ని ఇంత అభిమానిస్తున్నారు. మీరు కూడా కవేనా...?

లేదు...లేదు... కేవలం వింటాను. ఉషతో ప్రేమలో ఉన్నప్పుడు కేవలం తన కోసం చాలా కవితలు రాసుకునేవాడిని అంతే.

మీకు నచ్చిన కవిత్వాలు...?

మహా ప్రస్థానం కంఠస్థంగా చెప్పగలను. గాలిబ్ గీతాలు, తిలక్ అమృతం కురిసిన రాత్రి, కృష్ణశాస్త్రి గారి కవిత్వం చాలా ఇష్టం.

ఎండావానలు మరచి, ఆకలి దప్పులు విడిచి, అలుపెరుగక కవిత్వానికి ఆయన చేస్తున్న సేవ అపూర్వమైనది. మొన్నటి వరకు ఆయన జీవితం కేవలం డబ్బు సంపాదన కోసం గడిస్తే, తోపుడు బండితో తన నిజమైన జీవితం ప్రారంభమైందని ఆయన ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రస్థానం విజయవంతంగా కొనసాగాలని, ఆయన ఆశించిన విధంగా గడపగడపకు కవిత్వం చేరాలని కోరుకుందాం. ఆయన కృషికి అభినందనలు, సహకారం అందించాలనుకుంటే 9346108090 నెంబర్‌కి ఫోన్ చేయవచ్చు.

-ఇంటర్వ్యూ:సలీమ

వెంకటేష్ ప్రభు కస్తూరి రాజాగా పుట్టి ధనుష్‌గా వెండితెరకు పరిచయమైన నటుడు తెలుగు వారికీ తెలిసినవాడే. ప్రధానంగా తమిళ సినిమాలే చేసినప్పటికీ ‘వై దిస్ కొలవెరి డి’ పాటతో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకున్నాడు. అటు తండ్రి (కస్తూరి రాజా), ఇటు భార్య (ఐశ్వర్య) దర్శకత్వంలో చిత్రాలు చేసిన వాడిగా ప్రత్యేకమైన గుర్తింపు పొందిన ధనుష్ ఉత్తమ జాతీయ నటుడి అవార్డు కూడా అందుకున్నాడు. నటుడు, దర్శకుడు, నిర్మాత, పాటల రచయిత, గాయకుడు, కథా రచయితగా బహుముఖ ప్రజ్ఞావంతుడైన ధనుష్ తన సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి ఏం చెప్తున్నాడో చూద్దాం.

ప్రతిభను మించిన అందం లేదు

‘రాన్‌ఝూనా’ విడుదలైన తర్వాత బాల్కీ సార్ నుంచి మెసేజ్ వచ్చింది. ఒకసారి తనని కలవమని. తన చిత్రంలో నాకు ఏదైనా అవకాశం ఇవ్వడానికి ఆయన మెసేజ్ వేశారా? లేక గౌరీ మేడమ్ (గౌరీ షిండే, చిత్ర దర్శకురాలు, బాల్కీ భార్య) పంపారా? అనేది నాకు అర్థంకాలా. అయితే ఆయనను కలవడానికి వెళ్లేప్పుడు ... ఆనంద్ ఎల్ రాయ్‌తో జరిగిన సంభాషణ నాకు గుర్తుంది. “బాల్కీ సర్ తను చేయబోతున్న చిత్రంలో అవకాశం ఇస్తే ... దయచేసి చేయనని మాత్రం చెప్పకు. చేసేయ్” అన్నాడు. నేను ఎంపిక చేసుకున్న చిత్రాలు మాత్రమే చేస్తానని అతనికి తెలుసు. నేను స్టార్ నటుడిని కాను. పైగా బాల్కీ సర్ అభిమానిని కూడా. ఏదో ఒకనాడు అతనితో కలిసి పని చేస్తానన్న నమ్మకం నాకుంది. దాంతో ఆయన పంపిన మెసేజ్ నాకు ఆశ్చర్యానందాలను కలిగించింది. ఆయన కథ చెప్పిన తీరు చాలా బాగుంది. గాలిలో తేలిపోయానంతే. ఒప్పేసుకున్నాను. అమితాబ్ బచన్‌తో కలిసి నటించడం అనేది నాకు లభించిన గొప్ప గౌరవం. అరుదైన అవకాశం. మరీ ముఖ్యంగా, గట్టి పట్టున్న ‘షామితాబ్’ లాంటి కథకు పని చేయడం. పోటాపోటీగా, శక్తిమంతంగా నటించడానికి... నటనలో ఆయనను అధిగమించడానికి అవకాశమున్న సన్నివేశాలున్నాయి ఇందులో. ఆయనతో నేను కలిసి నటించానా అనిపిస్తుంది ఇప్పటికీ. నేను తనతో కలిసి పనిచేయడానికి అనువైన వాతావరణాన్ని నాకు అందించేవారు అమితాబ్. నా పనిలో కలగచేసుకునేవారు కాదు. తమ అనుభవాన్ని ప్రదర్శించడానికి ఆయనలాంటి మహానటులకు పెద్ద కష్టమేమీ కాదు. పైగా నేను ఆయన పాత్రను మాత్రమే చూశాను కానీ ఒక స్టార్‌ని కాదు. ఒక నటుడిగా నన్ను ఆయన గౌరవిస్తే...నేను ఆయనను గౌరవించేవాణ్ణి. తొలిసారిగా తెరంగేట్రం చేస్తున్న అక్షర హసన్‌తో కలిసి నటించడం మరపురాని అనుభవం. ‘నటనకు కొత్త’ అన్న భావమే కలగనివ్వలేదు అక్షర. తను చాలా చురుకైన అమ్మాయి. వచ్చింది. తన పని చేసింది. వెళ్లిపోయింది. నన్ను నేను అక్షరతో పోల్చుకునేవాడిని. నా కెరీర్ ప్రారంభించిన కొత్తలో ఎలా వుండేవాణ్ణో గుర్తొచ్చేది నాకు. ఆమెలో నాకు నేను కనిపించేవాణ్ణి. తనతో కలిసి పనిచేయడం

నేను మంచి కథా చిత్రాలలో పనిచేయాలనుకుంటాను. భాష గురించి బెంగపడను. అది హిందీనా, తమిళా, తెలుగు చిత్రమా అని చూడను. ఒక మంచి చిత్రమనే అనుకుంటాను. మనందరం భారతీయ చిత్రరంగంలో భాగమే. నేను ఒక హిందీ చిత్రం చేస్తున్నానంటే ... దేశం దాటి బయటికి పోయి ఇరానియన్ చిత్రం చేస్తున్నానని కాదు. షామితాబ్ ఒక ఛాలెంజింగ్ పాత్ర. ఆ చిత్రం నాకు అనేక అవకాశాలన్చింది.

హిందీ చిత్ర పరిశ్రమకు దక్షిణాది సినిమా రంగానికి... తేడాలున్నాయని మీరు నమ్ముతున్నారా? ఉత్తర భారతదేశానికి చెందిన సాంకేతిక నిపుణులు దక్షిణాదిన పనిచేస్తున్నారు. వారు వేర్వేరు నగరాలకు చెందినవారన్నది నిజం. అయితే పనికి సంబంధించి వారి అనుభవాలు ఒకేలా వుంటాయి. ‘రాన్‌ఝూనా’ చిత్రంలో చేసేటప్పుడు తమిళం మాట్లాడే కెమెరామెన్‌ను చూశాను. తమిళ చిత్రం కోసం చేసేప్పుడు ముంబై నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులు ఎదురౌతుంటారు. అవును, ఆహారం, సంస్కృతి, భాష వేరుగా వుంటాయి. అవి మినహా, నా సొంత ప్రాంతంలో పొందిన గౌరవమే నాకు

అమితాబ్‌తో...

ముంబైలోనూ లభిస్తుంటుంది. నా పనిని గుర్తించి నన్ను శ్రద్ధగా చూసుకుంటారు. వేరే నగరంలో వున్నానన్న భావన నాకెప్పుడూ కలగలేదు. అది కూడా నా షూటింగ్‌లో మరో రోజు లాంటిదే.

నేను మణి సార్‌ని కలిసి సినిమా గురించి మాట్లాడాను. ఇంకా ఏదీ ఖరారు కాలేదు. కానీ ఆయనతో పని చేయడానికి ఆతృతతో ఎదురుచూస్తున్నాను. నేను ఎక్కడికెళ్లినా, ప్రతి దర్శకుడు కూడా మణిసార్ నుంచి ఎంతో కొంత నేర్చుకున్నామనే చెప్తారు.

నాకు చక్కటి ఆరోగ్యాన్ని... ఆలోచనలను ఆ పైవాడు అందిస్తే... మామయ్య రజనీకాంత్‌లా 64 ఏళ్ల వయసులో కూడా చక్కగా నటించడం సాధ్యమే. అయితే అది అంత సులభం కాదు. ఇన్నాళ్ల తర్వాత కూడా రజనీకాంత్, అమితాబ్ బచన్‌లకు అభిమానుల సంఖ్య అంతకంతకు పెరుగుతూనే వుంది. ఇద్దరిమీద వారికి ఎనలేని ప్రేమాభిమానాలున్నాయి. వారికి కూడా ఆ విధమైన చరిష్మా వుంది. అమితాబ్, రజనీకాంత్ పొందిన దాంట్లో రెండు శాతం సంపాదించుకున్నా మా అభిమానులు మమ్మల్ని అరవయ్యేళ్లప్పుడు కూడా కావాలనుకుంటారు. ప్రతి నటుడికీ తనదైన బలం వుంటుంది. కొందరికి తెరమీద చరిష్మా రూపంలో కనిపిస్తుంది. మరికొందరికి డాన్స్‌లో వుంటుంది. ఇంకొందరికి నటనలో వుంటుంది. నా బలం ఏంటంటే... నేను పోషిస్తున్న పాత్రకు ఎంత మాత్రం కనెక్టవుతాననేదే చూస్తాను. నేనెప్పుడూ సురక్షితమైన జోన్‌లోనే వున్నాను. మంచి నటుల్లో ఒకడిగా నన్ను జనం గుర్తుంచుకోవాలి. అంతే. నేను ప్రశంసలను ఇష్టపడతాను. రాత్రంతా కూర్చుని వినమన్నా వింటాను. నా గురించిన ప్రతికూల విషయాలు చెప్పినా సరే. కూర్చుని విశ్లేషించుకుంటాను. నేను చేసే పనిని అర్థంచేసుకోవడానికి నా పిల్లలు (లింగ రాజా, యాత్ర) మరీ చిన్నవాళ్లు. అయితే నేను ఏది చేసినా నా భార్యకు (ఐశ్వర్య రజనీకాంత్), మా అమ్మకు నచ్చుతుంది. ఇంక వారిని అడగడమనేదే వుండదు.

సంగీతం అంటే ప్రాణం. అది లేకుండా బతకలేను. కానీ నేను సంగీత దర్శకుణ్ణి కాదు. నాకు అందులో ఆసక్తి వుందంతే. ఓ ప్రయత్నం చేస్తే... అది అద్భుతాలను సృష్టించింది. ప్రస్తుతానికి నటన మీద కేంద్రీకరించాలనుకుంటున్నాను.


రజనీకాంత్‌తో...

నాకు ఇద్దరు ముద్దులొలికే పిల్లలున్నారు. లింగ రాజాకు నాలుగేళ్లు. యాత్రకు ఎనిమిదేళ్లు. మంచి మనసున్నవాళ్లు. పసితనంలో వారితో నేను గడపలేకపోతున్నాను. మరో ఐదారేళ్లయ్యేసరికి వాళ్లు పెద్దవాళ్లైపోతారు. చాలా వేగంగా పెరిగిపోతున్నారు పిల్లలు. కానీ నేను ఏదైతే చేస్తున్నానో అది వాళ్లకోసమే. నాభార్య ఐశ్వర్య దర్శకత్వంలో '3' చిత్రం చేశారు. ఆ తర్వాత మా ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా గురించి! కష్టమే! మేమిద్దరం పిల్లల పక్కన లేకపోతే... వాళ్లు మా పెద్దవాళ్ల దగ్గర వుండాల్సి వస్తుంది. అది నాకు ఇష్టం లేదు. ఆమె ఇప్పటికీ సినిమాలు చేస్తూనే వుంది. కానీ నేను అక్కడ లేనప్పుడు తను పిల్లలతో వుంటుంది.

మా నాన్న (దర్శకుడు కస్తూరి రాజా) 'తుల్లువధో ఇల్మాయ్' (2002)లో నటించమని నన్ను ఒత్తిడి చేశారు. నాలో ఒక నటుణ్ణి చూశారాయన.

భార్య పిల్లలతో

అప్పుడు నాకు పదహారేళ్లు. అప్పుడు నేను చెఫ్‌ని కావాలని అనుకునేవాణ్ణి. చాలా మంది తమకెందులో ప్రతిభ వుందో తెలుసుకోవడానికి జీవితాంతం కష్టపడతాను. కానీ నా విషయంలో ... నా ప్రతిభే నన్ను వెతికి కనిపెట్టింది. మరింక ఎందులోనూ సక్సెస్ అయ్యేవాణ్ణి కాను. నిజానికి నేను కేవలం ఒక్క సినిమా మాత్రమే చేసి...తర్వాత నాకు ఇష్టమైన పని చేయాలనుకున్నాను. కానీ మా అన్నయ్య సెల్వరాఘవన్ 'కాధల్ కొండెయిన్' చిత్రంలో చేయమని అడిగారు. అది నన్ను రాత్రికి రాత్రి స్టార్‌ని చేసేయడంతో అంతా మారిపోయింది. ఇంక వెనక్కి తిరిగి చూసుకోలేదు. నటుడిగా నాకు ఎలాంటి శిక్షణా లేదు. అంతా స్వయంగా నేర్చుకున్నదే.

'ఇతను నటుడు కావాలని ఇతను ఎలా అనుకున్నాడు?' అని రాశారు తొలి సమీక్షలో. అది నా మనోధైర్యాన్ని దెబ్బతీసింది. ఆ పేపరు చించేసి...పెద్దగా కేకలు వేశాను. కానీ నేను అప్పుడు కేవలం పదహారేళ్లవాణ్ని అంతే. ఇప్పుడు, ఎవరైనా అలా రాస్తే నేను ఓ నవ్వు నవ్వుకుని వెళ్లిపోతాను. బాహ్యరూపం ప్రతిబంధకం అవుతుందని అనుకోను. నువ్వు ఏం చేయగలవన్నదే ప్రధానం. విజయం, ప్రతిభను మించిన అందమైంది ఈ ప్రపంచంలో మరేదీ లేదు.

ఇటీవలి కాలంలో నావి నాలుగు సినిమాలు పరాజయం పాలయ్యాయి. ఏదైతే నాదో దాన్ని నానుంచి ఎవరూ దూరం చేయలేరు. గత నాలుగేళ్లలో భిన్నమైన చిత్రాలను చేయడానికి ప్రయత్నించాను. అంతకముందు కేవలం బ్లాక్‌బస్టర్ సినిమాలు మాత్రమే చేశాను. నాణ్యమైన చిత్రాలు చేయడం లేదని గమనించాను. అలా... 'ఆడుకాలం' చిత్రానికి ఉత్తమ జాతీయ నటుడి అవార్డు అందుకున్నాను. ఈ మధ్యే వి.ఐ.పి' అనే సినిమా చేశాను. అది పూర్తిగా కమర్షియల్ చిత్రం. బాగా ఆడింది. ఇప్పుడు వినోదాత్మక చిత్రాలను... నాణ్యమైన చిత్రాలను బ్యాలెన్స్ చేసుకుంటూ నటించాలనుకుంటున్నాను. ✦

కువైట్ జ్ఞాపకాలు...

ఉద్యోగ నిర్వణలో భాగంగా పలు దేశాలకు వెళ్ళాల్సి ఉంటుంది. గతంలో పోలెండ్‌లో పని చేసినపుడు దాదాపు అన్ని ఐరోపా దేశాలు పర్యటించాను. కొంతకాలంగా దుబాయ్‌లో పని చేస్తుండటంతో మా సంస్థకి సంబంధించిన వ్యాపార కార్యకలాపాలు మధ్య ప్రాచ్యంలో ఉన్న ఒమన్, కువైట్, ఖతర్, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలో విస్తరించి ఉన్నాయి. ఎక్కడికి బిజినెస్ ట్రిప్ వెళ్ళినా స్వామి కార్యం, స్వకార్యం రెండూ కలిసి వచ్చేలా ప్లాన్ చేసుకుంటాను. కనీసం ఒక్క రోజైనా ప్రత్యేకంగా అక్కడి విశేషాలను, చారిత్రక అంశాలను తెలుసుకోవటానికి పెట్టుకుంటా. ఈ మధ్య అలాగే మొదటి సారి కువైట్ వెళ్ళాల్సి వచ్చింది.

దుబాయ్ నుండి కువైట్ సరిగ్గా గంట నలభై నిమిషాలు ప్రయాణం. కువైట్‌లో రెండు ఎయిర్ పోర్ట్‌లు ఉన్నాయి. కువైట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ 'అల్‌సాద్'. మధ్య ప్రాచ్య దేశాల నుండి వచ్చే చిన్న విమానాలు అల్‌సాద్ ఎయిర్ పోర్ట్‌కే వస్తాయి. దుబాయ్ రెసిడెన్స్ వీసా ఉంటే గల్ఫ్ కౌన్సిల్ దేశాల్లో ఆగమానంతర వీసా తీసుకోవచ్చు. అల్‌సాద్ ఎయిర్‌పోర్ట్ చాలా చిన్నది. ఫ్లైట్ దిగగానే ఇమ్మిగ్రేషన్ కౌంటర్ పక్కనే వీసా తీసుకునే సదుపాయం ఉంది. వీసా ఖరీదు 3 కువైట్ దినార్లు. ప్రపంచంలో అత్యధిక విలువ కలిగిన కరెన్సీ కువైట్ దినార్. ఒక దీనార్‌కి 210 రూపాయలు వస్తాయి. మా గ్రామానికి చెందిన మూల్పూరి వెంకటేశ్వరరావు గారు గత ఎనిమిదేళ్లుగా కువైట్‌లోనే పని చేస్తున్నారు. నేను మొదటిసారిగా అక్కడికి వెళుతుండటంతో నన్ను రిసీవ్ చేసుకోవటానికి ఆయనే ఎయిర్‌పోర్ట్‌కి వచ్చారు. వెళ్ళిన మొదటి రోజు ఆఫీస్ పనులన్నీ త్వరగా పూర్తి చేసుకుని మరుసటి రోజు కువైట్ నగరాన్ని చూడాలని నిశ్చయించుకున్నాను. ఈ దేశం పేరు వినగానే నాకు మొదట గుర్తొచ్చేది 1990లో జరిగిన గల్ఫ్ యుద్ధం. అప్పటికి నా వయసు తక్కువే అయినా పత్రికల్లో వచ్చిన వార్తలు నా మనసులో అలాగే ఉండి పోయాయి. నా ఆసక్తిని గమనించిన వెంకటేశ్వరరావు గారు మరుసటి రోజున సెలవు పెట్టి మరీ నాకు అక్కడి విశేషాలను చూపించటానికి వచ్చారు.

కువైట్‌లో రెండు నేషనల్ మ్యూజియంలు ఉన్నాయి. ఒక మ్యూజియంలో ఒకప్పటి కువైట్ నిర్మాణం, అప్పటి ప్రజల జీవన విధానం, నౌకల ద్వారా భారత దేశంలో జరిగిన వాణిజ్యంతో పాటు, తవ్వకాల్లో దొరికిన పురాతన వస్తువులను ప్రదర్శనకి ఉంచారు. 1950లో తొలి అరబ్బీ పత్రిక ఇక్కడి నుండే వెలువడింది. ఈ మ్యూజియం పక్కనే సైన్స్ ప్లానిటోరియం ఉంది. మేం వెళ్ళినప్పుడు కొన్ని స్కూల్ బస్సుల్లో పిల్లలు ప్లానిటోరియం చూడటానికి వచ్చారు. దీనికి దగ్గర్లోనే ఈ దేశపు పార్లమెంటు వుంది.

క్లుప్తంగా కువైట్ కథ

1961లో బ్రిటిష్ పాలన నుంచి విముక్తి చెందాక 1963లో కొత్త ముసాయిదా రాజ్యాంగాన్ని, పార్లమెంట్‌ని ఏర్పరచిన మొట్టమొదటి గల్ఫ్ దేశం కువైట్. 1963లోనే తొలిసారి ఎన్నికలు నిర్వహించారు. కాని మహిళలకి ఓటు హక్కు మాత్రం 2006 దాకా రాలేదు. 2009 నాటికి రోలాతో పాటు మరో ముగ్గురు మహిళలు ప్రజా ప్రతినిధులుగా పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. ఇక్కడ రాజు సర్వాధికారి. కాని రాజు ప్రతిపాదించిన డిక్రీలని తిరస్కరించే అధికారం పార్లమెంట్‌కి ఉంది. 2006లో ఒకసారి రాజుని కూడా మార్చిన ఘనత ఈ పార్లమెంట్‌ది. ముబారక్ అల్‌సబా పాలనలో గల్ఫ్ మార్సెల్స్‌గా అభివృద్ధి చెందిన కువైట్ రాజ్యానికి ప్రస్తుత రాజుగా సబా అల్ అహ్మద్ ఆల్ జబీర్ అల్ సబా కొనసాగుతున్నారు. రాజు ప్రతిపాదించిన పార్లమెంట్ ద్వారా ఎన్నుకోబడ్డ ప్రధాని మంత్రి నాసర్ అల్ ముహమ్మద్ ఆల్ అహ్మద్ అల్ సబా. వీరిద్దరి ఫొటోలు నగరంలో ప్రతి చోటా కనిపిస్తాయి. కువైట్‌కి సౌదీ అరేబియా, ఇరాక్ పొరుగు దేశాలు, రోడ్డు మార్గం ద్వారా ఈ రెండు దేశాలకి వెళ్ళవచ్చు.

సద్దాం మెమోరియల్

కువైట్ హిస్టారికల్ మ్యూజియం చూశాక దానికి కొద్ది దూరంలోనే ఉన్న 'కువైట్ హౌస్ ఆఫ్ నేషనల్ మ్యూజియం' (సద్దాం మెమోరియల్) చేరుకున్నాం. చిత్తూరుకి చెందిన ఇస్మాయిల్ అనే తెలుగువాడు ఈ మ్యూజియంకి గైడ్. ఇక మా పని మరింత సులువు అయింది. ఇరాక్ ఆక్రమణను, ఆ తరువాత ఆరు నెలల పాటు సాగిన ఆ యుద్ధాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించే విధంగా ఆ ఉదంతాన్నంతటిని బొమ్మల రూపంలో పొందు పరిచారు. మనం ఒక్కో ఘట్టాన్ని చూస్తున్నపుడు వాటి తాలూకు శబ్దాలన్నీ బ్యాక్ గ్రౌండ్లో వినిపిస్తూ అక్కడ నిజమైన యుద్ధమే జరుగుతోందా అనే భావనని కలుగ జేస్తాయి. ఒక్కో ఘటన గురించి ఇస్మాయిల్ చెప్తుంటే మాకు ఒళ్ళు జలదరించింది. 1966లో స్థాపించిన కువైట్ యూనివర్సిటీ ఈ దాడిలో పూర్తిగా ధ్వంసం అయింది. ఆ సమయంలో యూనివర్సిటీలో పాఠాలు చెప్పే టేబుల్ పైన పడిన ఒక బాంబుని అక్కడ యథాతథంగా ఉంచారు. ఈ ఆక్రమణలో వేలాది మంది కువైట్ పౌరులు మరణించారు. చాలా మంది జాడ తెలియలేదు. నేటికి యుద్ధం ముగిసి పాతికేళ్ళు అయ్యింది. అయినా ఆనాటి ఘటనలను కువైటీలు ఎన్నటికీ మర్చిపోరు.

యుద్ధంలో పాల్గొన్న ఇతర దేశాల సైనికులు కూడా చాలా మంది మరణించారు. వారి ఫోటోలనూ ఇక్కడ చూడవచ్చు. అన్నిటికంటే మమ్మల్ని ఆకర్షించిన అంశం చివర్లో ఉంచిన సద్దాం ఛాయా చిత్రాలు. తలభాగం మాత్రమే ఉన్న సద్దాం విగ్రహం. మనలో చాలా మందికి 2003లో అమెరికా ఇరాక్ యుద్ధ సమయంలో సద్దాంని అరెస్ట్ చేశాక నగర మధ్యలో ఉన్న సద్దాం విగ్రహాన్ని కూల్చేసిన ఫొటో ఒకటి గుర్తుండే ఉంటుంది. ఆ విగ్రహ తల భాగాన్ని అమెరికా కువైట్‌కి కానుకగా ఇచ్చింది.

ఇక అక్కడి నుంచి కువైట్‌కి ల్యాండ్ మార్క్‌గా భావించే జంట టవర్ల దగ్గరకి బయలు దేరాం. 1979లో ఆధునిక కువైట్‌కి ప్రతి రూపంగా నిర్మించిన ఈ టవర్లు చూడకుండా కువైట్ సందర్శన పూర్తి కాదు. ప్రస్తుతం ఆధునీకరణ జరుగుతుండటంతో మాకు పైకి వేళ్ళే అవకాశం రాలేదు. కువైట్ సిటీ మెయిన్ రోడ్డు అంతా సముద్రం పక్కనే ఉండటంతో సందర్శకులను మరింతగా ఆకట్టుకుంటుంది.

ఎన్ని ఉగాదులో...

ఉగాది...తెలుగు ప్రజల తొలి పండుగ. సంవత్సరాది పండుగ. కొత్త సంవత్సర వేడుక. ఉగాది పండుగంటే చాలు! ఎన్నేసి ఊసులో! ఎన్నేసి రుచులో! ఎంత హడావిడో! తెల్లని మల్లెలూ, పుల్లని మామిళ్లూ, తియ్యటి చెరుకులు, చేదుపూతల వేప పువ్వులు, కవి సమ్మేళనాలు, పంచాంగ పఠన-శ్రవణాలు, కోకిలల కిలకిలా రావాలు, ఉగాది పచ్చళ్లు, పచ్చటి ప్రకృతి అందాలు...ఒకటా రెండా... ఎన్నని చెప్పకోవాలి?! ఆ రుచులన్నిటి సమ్మేళనంగా జీవితం వుంటుందన్నదే ఈ పండుగ చెప్పకనే చెప్పే జీవన సత్యం.

అయితే... ఉగాదిని వివిధ రాష్ట్రాల ప్రజలు రకరకాల తేదీల్లో, మాసాల్లో జరుపుకుంటారంటే నమ్మశక్యం కాదు. తమిళులు, కన్నడిగులు, మళయాళీలు, కాశ్మీరీలు, రాజస్థానీలు... తమ ప్రాంతీయ క్యాలెండర్ల ప్రకారం సంవత్సరాదిని ఎలా జరుపుకుంటారన్నదే ఈ వారం అట్టమీది కథ. 'మన్మథ' నామ సంవత్సరంలోకి అడుగెడుతున్న సందర్భంగా ఈ ప్రత్యేక కథనం మీ కోసం.

గుడి పడ్వా

మనది వ్యవసాయ ప్రధాన దేశం కావడంతో... మన పండగలన్నీ దాదాపుగా పంటలు, కాలాలతోనే ముడిపడి వుంటాయి. మహారాష్ట్రలో రబీ సీజన్ చివరలో 'గుడి పడ్వా' పండుగ జరుపుకుంటారు. 'చైత్ర శుక్ల ప్రతిపాద'ను మరాఠీ భాషలో 'గుడి పడ్వా' అని పిలుస్తుంటారు. చైత్ర మాసం తొలి రోజును సంవత్సరాదిగా జరుపుకోవడం మరాఠీల సంప్రదాయం. ఇది సాధారణంగా మార్చి-ఏప్రిల్ మాసాల్లో వస్తుంటుంది. ఆ రోజున వారు సంప్రదాయసిద్ధంగా గుడి పడ్వాను తయారుచేసి కిటికీలోంచి బయటికి కనిపించేలా ఏర్పాటు చేస్తారు. ఒక సన్నపాటి వెదురు బొంగుకు చిన్న రాగి (వెండి) చెంబును తగిలిస్తారు. జరీ అంచున్న నిండు ఆకుపచ్చ లేదా పసుపు రంగు బట్టను కూడా చివరలో ముడివేస్తారు. వేపాకులు, మామిడాకులు కడతారు. పైగా ఎర్రటి పూమాలను కూడా అలంకరిస్తారు. దీన్ని అందరికి కనిపించేలా అలంకరించడం వారి సంప్రదాయం. ఆరోజున అందరూ కొత్త బట్టలు వేసుకోవడానికి ఉత్సాహపడతారు. వాకిళ్లన్నీ శుభ్రంగా ముగ్గులతో కళకళలాడేలా అలంకరిస్తారు. వేపాకులు, బెల్లం, చింతపండుతో చేసిన పచ్చడిని అందరూ తప్పక తింటారు. ఇది రక్తాన్ని శుద్ధి చేస్తుందని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని, జబ్బులు దరిచేరవని వారి నమ్మకం.

పుథండు

ఇది తమిళుల సంవత్సరాది పండుగ. తమిళ క్యాలెండర్ మొదటి నెల 'చిథిరై' తొలి రోజు. గ్రెగేరియన్ క్యాలెండర్ ప్రకారం... ఏప్రిల్ 13 లేదా 14వ తేదీన ఈ పండుగ వస్తుంది. ఆరోజున అందరూ తమ ఇళ్లను శుభ్రం చేసుకుని అందంగా అలంకరించడంలో పోటీపడతారు. ఉపవాసం వుండటమే కాక బంధుమిత్రుల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు చెప్పుకుంటారు. అతిథులకు తీపి పదార్థాలు పెట్టేందుకు ముందుగానే సిద్ధంగా వుంచుకుంటారు. ఆరోజున మూడు రకాల పళ్లు (మామిడి, అరటి, పనస), తమలపాకులు, వక్క, బంగారు/వెండి ఆభరణాలు, పూలు, అద్దం వంటి వాటిని ఒక పళ్లెంలో పెట్టి సిద్ధం చేసుకుంటారు. కొత్త సంవత్సరం తొలిరోజున ఈ పళ్లెంలోని వస్తువులను చూస్తే శుభమని తమిళుల నమ్మకం. ఈ ప్రక్రియను వారు 'కన్ని' అని కూడా పిలుస్తారు. 'పుథండు'ను ఒక్క తమిళనాడులోనే కాక తమిళులు స్థిరపడిన ఇతర రాష్ట్రాలలో, దేశాలలో కూడా ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకుంటారు.

విషు

కేరళ ప్రజల సంవత్సరాది పండుగ 'విషు'. గ్రెగేరియన్ క్యాలెండర్ ప్రకారం ఇది ఏప్రిల్ రెండవ వారంలో వస్తుంది. మళయాళీలు సంవత్సరాది నాడు టపాసులు కాల్చడం

ప్రత్యేకంగా వుంటుంది. పైగా రాత్రి పూట దీపాలతో ఇంటిని అలంకరిస్తారు. కొత్త బట్టలు కొనుక్కోవడం, చిన్నవారికి పెద్దలు డబ్బును కానుకగా ఇవ్వడం వారి సంప్రదాయం. అంతేకాక ఉప్పు, తీపి, పులుపు, చేదు కలిగిన పదార్థాలను సమపాళ్లతో కలిపి ప్రసాదం చేసుకుని ఆరగిస్తారు. అన్నిట్లోకి ముఖ్యంగా సంవత్సరాది నాడు నిద్ర లేచిన వెంటనే మొదటిసారిగా శుభప్రదమైన వస్తువులను చూడాలన్నది వారి నమ్మకం. దాన్నే 'విషుక్కని' అని పిలుస్తారు. బియ్యం, పళ్లు, కూరగాయలు, తమలపాకులు, వక్క, అద్దం, పసుపు పచ్చటి పూలు, రూపాయి బిళ్లలు నింపిన పళ్లెం ఒకటి ముందు రోజు రాత్రే తయారుచేసి పూజ గదిలో వుంచుతారు. సంవత్సరాది నాడు అందరూ ఈ పళ్లేన్ని చూస్తే అదృష్టం వరిస్తుందని, ఐశ్వర్యం సిద్ధిస్తుందని వారి విశ్వాసం.

సాజిబు నొంగ్మ పంబ

మణిపూర్ వాసుల సంవత్సరాది పండుగ 'సాజిబు'. హిందూ చంద్రమాన క్యాలెండర్ తొలి మాసం 'సాజిబు' మొదటి రోజును కొత్త సంవత్సరం ప్రారంభ దినంగా భావిస్తారు. 'నొంగ్మ' మొదటి నెల మొదటి రోజు. ఉదయాన్నే 'మైటై' దేవతకు బియ్యం, పళ్లు, కూరగాయలు వంటి ఉడికించని పదార్థాలను సమర్పిస్తారు. తర్వాత సరి సంఖ్యలో వుండేలా వంటకాలు తయారుచేసి నైవేద్యం పెడతారు. ఇక్కడ విశేషం ఏమంటే... ఈ ప్రసాదాలన్నీ మగవాళ్లే చేయాలి. ఇది వారి సంప్రదాయం. ఆడవాళ్లు కేవలం సహాయకులు మాత్రమే. అంటే కూరగాయలు తరిగి ఇవ్వడం, కడిగి ఇవ్వడం...వంటి చిన్న చితక పనులు మాత్రమే చేస్తారు. అయితే ఇక్కడి ప్రజలు ఇల్లంతా శుభ్రం చేసినప్పటికి రెండు ప్రదేశాలను చాలా శ్రద్ధగా శుభ్రంచేసి అలంకరిస్తారు. అవేంటంటే... ఇంటి ముందు గేటు, వెనక గేటు. ఈ గేట్ల ముందర కొంత భాగాన్ని మట్టితో అలికి పూలు, ఆకులతో అలంకరిస్తారు. ఇక్కడ ముగ్గురు దేవతలకు పూజలు కూడా చేస్తారు. ఇక్కడ అరిటాకు మీద అన్నం, రూపాయి నాణేలు, పూలు, పళ్లు, కొవ్వొత్తి , ఒక చిన్న పాటి కర్ర వుంచుతారు. అన్నీ అయ్యాక విందుకు సిద్ధమౌతారు. విందు ఆరగించాక కుటుంబ సభ్యులంతా కలిసి స్థానికంగా వున్న కొండ దేవతను సందర్శించి వస్తారు. ఈ కొండ ప్రాంతమంతా ఒక తిరునాళ్లలా తయారైపోతుంది. చిన్న చిన్న అంగళ్లు, తినుబండారాలు, వస్తువుల అమ్మకందార్లు ... అక్కడ కొలువుదీరతారు. దాంతో కొండకు

పాయిలా బైశాఖ్

పశ్చిమబెంగాల్‌లో నూతన సంవత్సరాది పండుగను బైశాఖ్ నెల తొలి రోజున జరుపుకుంటారు. బెంగాలీ క్యాలెండర్‌లో మొదటి నెల బైశాఖ్. ఇది సామాన్యంగా ఏప్రిల్ 14వ తేదీన వస్తుంది. ఆరోజున బెంగాలీలంతా ఎంతో ఉత్సాహంగా సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోజున దాదాపుగా అందరూ కొత్త బట్టలు వేసుకుంటారు. ఇల్లంతా శుభ్రంచేసుకొని వాకిట్లో చక్కటి ముగ్గులు పెట్టుకుంటారు. ముగ్గు మధ్యలో తెల్లటి స్వస్తిక్ మార్కు తప్పక వేస్తారు. ప్రత్యేకమైన వంటకాలు తయారుచేసి ఇంటికి వచ్చిన అతిథులకు రుచి చూయించడం ఇక్కడి ఆచారం. పైగా ఆరోజున జరిగే ఉత్సవాలు, పాటలు, డాన్సులు, నాటకాలు...చూడాల్సిందే కానీ మాటల్లో చెప్పలేం. సంప్రదాయ నృత్యాలు, పాటలతో వాతావరణం కన్నుల పండుగగా వుంటుంది. మనకి మాదిరిగానే సంవత్సరాది రోజున పాత పద్దులన్నీ లెక్కలు తేల్చేసుకుని కొత్త పద్దు పుస్తకాలతో వ్యాపారం ప్రారంభిస్తారు. మరో విశేషం ఏమంటే ఇతర జాతీయ పండగలతో సమానంగా ఈరోజున అన్ని కార్యాలయాలకు సెలవు వుంటుంది. పైగా పెళ్లిళ్లకు కూడా ఈ నెలను శుభప్రదమైనదిగా భావిస్తారు. బట్టలు, కుటుంబాలకు కావాల్సిన వస్తువులను కూడా ఆరోజు కొనుగోలు చేయడానికి ఎక్కువగా ఆసక్తి చూయిస్తారు బెంగాలీలు. దాంతో కొనుగోలుదార్లను ఆకట్టుకోడానికి షాపులవారు భారీ డిస్కౌంట్లు కూడా ప్రకటిస్తుంటారు. ఒక్క పశ్చిమ బెంగాల్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాలలో, స్వీడన్, బ్రిటన్ వంటి విదేశాల్లో వున్న స్థానికులు కూడా 'పాయిలా బైశాఖ్' ఘనంగా జరుపుకుంటారు.

బొహాగ్ బిహు

అస్సామీల సంవత్సరాది పండుగ ఇది. దీన్నే రంగోలి బిహు, హాత్ బిహు అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఏప్రిల్ 13వ తేదీన వస్తుంది. వైశాఖ మాసం (భాస్కర క్యాలెండర్) తొలిరోజున ఈ పండుగ చేసుకుంటారు. నిజానికి దీన్ని ఏడు రోజుల పాటు చేసుకుంటారు. ఒక్కో రోజున ఒక్కో పండుగ చేసుకుంటారు. చోట్ బిహు, రాతి బిహు, గోరు బిహు, మనుష్ బిహు, కుటుమ్ బిహు, మేళ బిహు, చేర బిహుగా ఏడు రోజులను పిలుస్తారు. నిజానికి ఈ పండుగ అస్సామీలకు చాలా ముఖ్యమైనది. సంప్రదాయ నృత్యాలు, పాటలతో హోరెత్తిపోతుంది రాష్ట్రం. 'బిహు' అనే పదం ధింసా ప్రజల భాష నుంచి పుట్టింది. 'బి' అంటే అడుగు అని, 'హు' అంటే శాంతి, సౌభాగ్యం అని అర్థం. 'బిషు' అనే పదం క్రమేణా 'బిహు'గా మారిపోయింది. మరో అర్థం కూడా చెప్తుంటారు. 'బి' అంటే అడగడం 'హు' అంటే ఇవ్వడం. 'బిహు' అంటే ఇచ్చిపుచ్చుకోవడం. కులాలు మతాలతో సంబంధం లేకుండా అస్సాం ప్రజలంతా ఈ పండుగను ఆస్వాదిస్తారు. బెంగాల్, మణిపూర్, ఒరిస్సా, పంజాబ్, కేరళ, తమిళనాడులో కూడా ' బొహాగ్ బిహు' పండుగ వాతావరణం కనిపిస్తుంది.

వచ్చిన వారంతా తమకు నచ్చిన వస్తువులను కొనుక్కుంటుంటారు సరదాగా. అయితే .. కొత్త సంత్సరం తొలి రోజున... ఇంట్లో వున్న అన్ని వస్తువులు, బట్టలు...అన్నిటినీ బయటకు తీసి శుభ్రం చేయడం సంప్రదాయంగా వస్తోంది.

నవ్‌రేహ్

కాశ్మీరీ ప్రజల సంవత్సరాది నవ్‌రేహ్. చైత్ర మాసం తొలి రోజున ఈ పండుగ జరుపుకుంటారు. సాధారణంగా మార్చి-ఏప్రిల్ మాసాల్లో వస్తుంది. 'నవరేహ్' అనే పదం 'నవ వర్ష' అనే సంస్కృత పదం నుంచి పుట్టింది. అంటే కొత్త సంవత్సరం అని అర్థం. కాశ్మీర్ నుంచి వలస వెళ్లిన కాశ్మీర్ ప్రజలు ఎక్కడ వున్నా ఈ ఉత్సవాన్ని అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో చేసుకుంటారు. తమిళుల వలే వీరు కూడా ఒక పళ్లెంలో కొన్ని పువ్వులు (గులాబి, బంతి, మల్లె), కొత్త పంచాంగం, కొద్దిగా తీపి పదార్థం, కొన్ని బాదం పప్పులు, వెండి నాణెం, డబ్బులు, అద్దం, పెన్ను, కప్పు పెరుగు, పాలుతో నిండుగా సిద్ధం చేస్తారు. ఆరోజు ఉదయాన్నే ఇవన్నీ నిండిన పళ్లేన్ని చూసిగానీ వేరే పనిలోకి వెళ్లరు.

థపన, బసోవ

రాజస్థాన్ ప్రజల నూతన సంవత్సరాది పండుగ 'థపనా'. రాజస్థాన్ క్యాలెండర్ తొలి మాసమైన 'చైత్ర శుద్ధ' తొలి రోజున ఈ ఉత్సవాన్ని జరుపుకుంటారు. ఆరోజున ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటారు. 'బసోవ' హిమాచల్ ప్రదేశ్ ప్రజల నూతన సంవత్సరాది. ఆరోజున అందరూ తమ ఇళ్లను శుభ్రం చేసుకోవడమే కాక పూలు, ఇతర అలంకరణ సామగ్రితో అందంగా తయారుచేస్తారు. సాయంత్రం వేళ దీపాలు వెలిగించి ఇల్లంతా వెలుగులతో కళకళలాడేట్లు చూసుకుంటారు. పైగా అందరూ కలి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఆచారం. జానపద పాటలు పాడుతూ, నృత్యం చేయడమంటే వారికెంతో ఇష్టం. ఇవండీ వివిధ ప్రాంతాల్లో ఉగాదుల ఊసులు. ప్రాంతం ఏదైనా, రాష్ట్రం వేరైనా, పండుగ జరుపుకునే తేదీలు, నెలలు వేరైనా... అందరి ఆకాంక్ష ఒక్కటే. ఆ ఏదాదంతా శుభప్రదంగా వుండాలని, ఆయురారోగ్యాలతో తులతూగాలనే ఆశ.

- చూటీ

నవ్వుల్ – పువ్వుల్

అరడజను గుడ్లు



కొత్త హీరోయిన్ : మేనేజర్ గారూ! అర్జంట్‌గా అరడజను కోడి గుడ్లు తెప్పించండి.

ప్రొడక్షన్ మేనేజర్ : ఎందుకమ్మా?

కొత్త హీరోయిన్ : మా అమ్మా, బాబాయి, మా చుట్టాలు తింటున్నప్పుడు యూనిట్ వాళ్ల కళ్లు పడ్డాయి. మేము దిష్టి తీసుకోవాలి.

చిన్నవి

సురేష్: రెండు కిలోల బంగాళదుంపలు ఇవ్వండి

(కూరగాయల అబ్బి ఇస్తాడు)

సురేష్: ఏంటయ్యా మరీ ఇంత పెద్దవి ఇచ్చావు. చిన్న చిన్నవి చూసి ఇవ్వు. తీసుకెళ్లడానికి తేలిగ్గా వుంటుంది.

చాలా స్ట్రిక్టు



'కొత్తగా వచ్చిన ఆఫీసర్... చాలా కరెక్టయిన మనిషి. ఎవరి దగ్గరయినా లంచం తీసుకున్నట్టు తెలిసిందంటే...'

'ఏం? సస్పెండ్ చేస్తాడా...?'

'చేయడు... సగం వాటా ఇమ్మంటాడు!'

కరుస్తుందా?

మహేష్: మేం ఇవాళ ఒక కొత్త కుక్కను తీసుకొచ్చామోయ్. చూడ్డానికి వస్తావా?

దినేష్: అది కరుస్తుందా?

మహేష్: అది తెలుసుకుందామనే నిన్ను రమ్మంది.

కలవరింత



భార్య : ఏవండీ! రోజు రాత్రులు నిద్రలో రాధా... రాధా! అని కలవరిస్తున్నారేంటి? కొత్తగా ఆ అమ్మాయిగానీ పరిచయం అయిందా?

భర్త : రాదా... రాదా.. అంటే అమ్మాయి కాదు. నాకు ఉద్యోగంలో ప్రమోషన్ రాదా అని అర్థం.

తెలుగు క్షోభ

టీచర్ : గోపీ! మన తెలుగు భాష అక్షరాలు ఎన్నో ఎప్పుడైనా గమనించావా?

గోపీ : ఇంగ్లీషులో చెప్పండి టీచర్. మాకూ తెలుస్తుంది.

కిడ్నీ

డాక్టర్ : నీ కిడ్నీ ఫెయిలయింది.

పేషెంట్ : డాక్టర్! ఏమంటున్నారు మీరు? నేను ప్రతి రోజూ కాలేజీకి వెళ్తున్నానే. మరి ఎలా ఫెయిలయింది?

పేషెంట్ స్నేహితుడు : అదేరా అటెండెన్స్ సరిపోలేదేమో!

న్యూ లుక్కు

యువకుడు : నాకు కొత్త స్టైలు గడ్డం గీస్తావా?

సెలూన్ వాలా : ఒక చెంప మాత్రమే గీస్తా. అప్పుడు అదే కొత్త స్టైల్ అవుతుంది.

జిరాక్స్

వెంగళప్ప : 5 తెల్ల పేపర్లు ఇవ్వండి.

షాపు యజమాని : 5 పేపర్లు లేవు. ఒక్కటే ఉంది.

వెంగళప్ప : పర్వాలేదు ఒక్కటే ఇవ్వండి. దాన్నే జిరాక్స్ తీయించుకుంటాను.

నాలుగో పేపర్



టీచర్: ఎగ్జామ్ హాల్లో కనిపించే మూడు పేపర్లు ఏవి?

పిల్లవాడు: క్వశ్చన్ పేపర్, ఆన్సర్ షీట్, అడిషినల్ పేపర్ ...ఇంకా ...

టీచర్: ఇంకానా! అవేకదా!

పిల్లవాడు: కనిపించని నాలుగో పేపర్ వుంది మేడమ్. అదే ...చిట్టీ.

◆ సీరియల్

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ-28

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

హాలండ్ నుండి ఖాళీ చేతులతో తిరిగి వచ్చిన జెన్నీ (పిల్లల కోసం ఒక బొమ్మ మాత్రం యిచ్చాడట లయన్ ఫిలిప్) పిల్లలను గుండెలకు హత్తుకుని మైమరిచి పోయింది. ఎన్ని యిబ్బందులున్నా ఎంత ఇరుకుగావున్నా ఇది తన యిల్లు. తన జీవితం. మార్క్స్ లండన్‌కు వచ్చిన తొలి రోజుల్లో ఆయనతో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తి ఆగస్ట్ విల్లిష్ సంపన్న కుటుంబంలో పుట్టినా కమ్యూనిస్టుగా మారాడు. 1848లో జరిగిన తొలి కమ్యూనిస్టు తిరుగుబాటు వ్యూహకర్తల్లో ఒకడు. ఆ (తిరుగుబాటులో) ఎంగెల్స్ అతని నాయకత్వంలో పనిచేశాడు. విల్లిష్ యిప్పుడు లండన్‌కు వచ్చి మార్క్స్ కూడి భుజంగా మారాడు. పార్టీ వ్యవహారాలూ రహస్య కార్యకలాపాలూ పర్యవేక్షించాడు. అయితే సైద్ధాంతిక చర్చలు, కబుర్లు అతడికిష్టం. అందగాడే కాని విచిత్ర వేషధారణలో జెన్నీకి అతడు డాన్ క్విక్సాట్‌లా కనిపించాడు. మార్క్స్ అతడి దూకుడుకు అడ్డు కట్ట వేసే ప్రయత్నం చేశాడు. ఒక వుదయం జెన్నీ బెడ్‌రూంలోకి దూసుకు వచ్చిన విల్లిష్ బిగ్గరగా నవ్వుతూ 'సహజ' కమ్యూనిజం మీద సైద్ధాంత చర్చ ప్రారంభించారు. ఎన్నిసార్లు యిలా చెయ్యవద్దని వాదించినా అతని పద్ధతి మారదే. అసలు విషయమేమంటే జెన్నీ మీద కన్నేశాడు విల్లిష్.

ఆమెను ఇష్టపడటం సహజమనిపించివుంటుంది అతడికి. తను అరిస్టోక్రాట్. ఆమె అరిస్టోక్రాట్. పెళ్లి చేసుకొని పేదరికంతో మగ్గుతోంది. 'అన్ని కుటుంబాల్లో యిలాంటివి జరుగుతాయి. గాలమేసి చూశాడు" అంది జెన్నీ. చేప చిక్కలేదు. కాని మార్క్స్ అసూయతో రగిలిపోయాడు.

మార్క్స్, ఎంగెల్స్, విల్లిష్ ముగ్గురూ లీగ్‌లోనూ శరణార్థుల విషయాల్లోనూ కలిసి పనిచేశారు. కాని మార్క్స్ ప్రకారం, 'వ్యక్తిగత' కారణాల వల్ల తమ మధ్య కొంత దూరం ఏర్పడింది. 1848 నుండే, సైద్ధాంతక కృషిని పక్కన పెట్టి రాజకీయ నిరసనలూ ప్రభుత్వ వ్యతిరేక పత్రికా రచనకు సమయమంతా కేటాయించినా, విప్లవం అంత త్వరలో వచ్చే అవకాశం లేదని స్పష్టమవుతూనే వుంది. కాని విల్లిష్‌కు సాహసాలూ, రహస్య కార్యకలాపాలూ ఇష్టం. కొద్ది మంది సభ్యులున్న లీగ్‌లో తిరుగుబాటు సాధ్యమని వాదించాడు. సామాజిక మార్పుకు చాలా కాలం పడుతుందన్న మార్క్స్ అభిప్రాయం తప్పన్నాడు. విప్లవం దానంతటదే రాదు. దానికి అనువైన పరిస్థితులను కల్పించాలి. దానికి సమయం పడుతుంది. అంటాడు మార్క్స్. హింసతో విప్లవం సాధ్యమే అంటాడు విల్లిష్.

వీళ్ల వాదనలతో ఒక విషయం స్పష్టమవుతుంది. మార్క్స్ సామాజిక పరిణామ క్రమాన్ని నమ్మాడే తప్ప తక్షణ విప్లవాలను కాదు. అతని అభిప్రాయాలు విప్లవాత్మకమైనవేగాని ఆచరణ పరిణామ క్రమాన్ని సమర్థిస్తుంది. మార్క్స్ ప్రకారం, ఒక చారిత్రక పరిణామ క్రమంలో భాగంగానే విప్లవం సాధ్యపడుతుంది. కాని

"పిల్లలే మార్క్స్ జీవితంలో వెలుగులు. దేశాలు మారటం, ఇళ్లు మారటం, చలి, ఆకలి, భాష తెలియని కొత్త వూరు ఇలా ఎన్ని సమస్యలున్నా 'పిల్లలు చలాకీగా ఆడుతూ పాడుతూ వున్నారు' అంది జెన్నీ. కాస్త బొద్దుగా వుండే మూడేళ్ల ఎడ్గార్ తన కోతి చేష్టలతో అదన్నీ నవ్విస్తారు. గొంతు చించుకొని తమాషా పాటలు పాడతాడు రోజంతా. ఫైల్‌గ్రాత్ రాసిన 'మార్సె' నుండి వాడు 'కమ్, ఓ, మూన్' అనే పాట అందుకున్నాడంటే యిల్లు మార్మోగిపోతుంది"

అపరిపక్వదశలో హింసద్వారా కాదు. ఒక సామాజిక శాస్త్రజ్ఞుని అవగాహన ప్రకారం రాజకీయ, సామాజిక కార్యకలాపాలలో పాల్గొని పాత సమాజం అంతరించి కొత్త సమాజం ఏర్పడటానికి రెండు పరిణామా దశలు అవసరం: ప్రజాస్వామిక స్వేచ్ఛలన్నింటినీ వుపయోగించుకొని సామాజిక రాజకీయ కార్యకలాపాలలో పాల్గొని కార్మిక సంఘాల ద్వారా ప్రజలలో వర్గ చైతన్యం పెంపొందించాలి. రెండు: వర్గరహిత కమ్యూనిస్టు సమాజానికి ముందు కొంత కాలం పెటీ బూర్జువా పాలన కొనసాగుతుంది. ఇదంతా పిరికివాళ్ల వాదన అంటాడు విల్లిష్. విప్లవ పోరాటం నుండి విరమించి సుఖజీవితాన్ని కోరుకుంటున్నాడు మార్క్స్ అని అతని అభియోగం.

వెంట ప్రైవేటు సైన్యం వుంటే తప్ప విల్లిష్ ఒంటరిగా ఎక్కడికీ కదలడు. అందువల్ల మార్క్స్‌కు వ్యతిరేకంగా ఒక గ్రూప్‌ను పోగుచెయ్యటానికి కూడా ప్రయత్నించాడు. అతడు అరిస్టోక్రాట్ అయినా, అతడి సమర్థకులందరూ జర్మన్ శరణార్థుల్లోని కార్మికులే. వాళ్లతోనే కలిసి నివసించాడు. కలిసి భోజనం చేశాడు. అందర్నీ ఎంతో స్నేహంగా 'నువ్వు' అంటూ సంభాషించాడు. ఈ కారణాల వల్ల అతనికి కార్మికుల్లో మార్క్స్ కన్నా పరపతి పెరిగింది. కార్మికుల నుండి సేకరించిన విరాళాలతో మార్క్స్ బూర్జువా కుటుంబ జీవితం జరుపుకుంటున్నాడని పుకార్లు పుట్టించారు. అంతకు ముందు, మార్క్స్ ఎంగెల్స్ లండన్‌లో వున్న 'యూనివర్సల్ సొసైటీ ఆఫ్ రివల్యూషనరీ కమ్యూనిస్ట్స్' అనబడే సంస్థతో సంబంధాలు పెట్టుకున్నాడు. ఇదే సంస్థలోని ఎమాన్యుయెల్ బార్తెలెమీ అనబడే నేరస్తుడితో పరిచయం పెంచుకున్నాడు విల్లిష్. హత్యలకు,

“ పుట్టినప్పటి నుండే జబ్బుగా వున్న పిల్లాడు గుయిడో. అయితే వాడు ఎక్కువకాలం బాధపడ లేదు. నవంబర్ 19 నాడు న్యుమోనియా ముదిరి నాల్గవ పుట్టిన రోజు తర్వాత తుది శ్వాస విడిచాడు. 'బుల్లి మందుగుండు కుట్రదారుడు' అనేవాళ్లు వాణ్ణి అందరూ. ఈ కుట్రదారు మరణించాడని ఎంగెల్స్‌కు రాశాడు మార్క్స్. 'అప్పటిదాకా నవ్వుతూనే వున్నాడు. మమ్మల్ని నవ్విస్తూనే వున్నాడు. మా పరిస్థితి ఎలా వుందో అర్థం చేసుకోగలవు. నువ్వు లేకపోవడంతో ఒంటరిగా వున్నట్టుంది'. ”



విల్లిష్

రాజకీయాలను ముసుగుగా వాడుకుంటాడు ఎమాన్యుయెల్.

మార్క్స్‌కు సన్నిహితుడైన యిరవై నాలుగేళ్ల యువ కమ్యూనిస్టు లీబ్ క్నెష్ట్ ప్రకారం, విల్లిష్, బార్తెలెమీలు మార్క్స్‌కు వ్యతిరేకంగా కుట్ర చేశారు. 'ఇతడు ద్రోహి. ద్రోహిని చంపెయ్యాల్సిందే' అన్నారు. కొన్నాళ్ల తర్వాత లీగ్ సమావేశానికి హాజరైన విల్లిష్ మార్క్స్‌ను పబ్లిగ్గా అవమానించి 'డ్యూయెల్'కు చాలెంజ్ చేశాడు. ఇది రాజకీయ శత్రుత్వంగా కనిపించినా, దీని వెనక అతడు జెన్నీని ఆశించడం అంతకన్నా ఎక్కువ. బార్తెలెమీ లాంటి నేరస్తుడి ప్రభావం కూడా వుండి వుంటాయని మరచిపోకూడదు.

డ్యూయెల్ వంటి పొట్లాటలకు విరుద్ధం మార్క్స్. అంతేకాక ఇంగ్లండులో వీటి మీద నిషేధం వుంది. అయినా కాన్రాడ్ ష్రామ్ అనబడే మార్క్స్ సన్నిహితుడు విల్లిష్‌ను అవమానించి, డ్యూయెల్‌కు తాను సిద్ధమన్నాడు. ఇప్పుడు పోట్లాట 24 ఏళ్ల ష్రామ్, 49 ఏళ్ల విల్లిష్ మధ్య. మార్క్స్ ఎంత వారించినా వినకుండా ష్రామ్, ఆ రాత్రికే మరో పోలిష్ అధికారితో కలిసి బెల్జియం వెళ్లాడు. విల్లిష్ బార్తెలెమీలు కూడా అటో యిటో తేల్చుకోవడానికి బయల్దేరారు. పిస్టల్స్‌తో జరుగుతుంది డ్యూయెల్. అప్పటివరకు ఒక్కసారి కూడా పిస్టల్ కాల్చలేదు ష్రామ్. ఒక్కసారి కూడా గురి తప్పలేదు విల్లిష్.

మరునాడు సెప్టెంబర్12న మార్క్స్ అపార్ట్‌మెంట్‌లో కూర్చున్నాడు లీబ్‌క్నెష్ట్. జెన్నీ, లెంచెన్ కూడా వున్నారు. ఈ డ్యూయెల్‌కు కారణం జెన్నీ కాదు. కానీ విల్లిష్ స్వభావం తెలుసు కనక తనకు ఇందులో బాధ్యత వుందనుకొంది జెన్నీ. రోజంతా వార్త ఏమైనా తెలుస్తుందేమోనని ఆందోళనగా నిరీక్షించారు. చివరికి మార్క్స్ లీబ్‌క్నెష్ట్ అపార్ట్‌మెంట్ నుండి బయటకు వెళ్లిన తర్వాత బార్తెలెమీ వచ్చి 'ష్రామ్‌కు తలలో తగిలింది బుల్లెట్' అని చెపి వెళ్లాడు. ఇంకేముంది అనుకున్నదంతా అయింది.

మార్క్స్ లీబ్‌క్నెష్ట్‌లు తిరిగి వచ్చిన తర్వాత దుర్వార్త చెప్పింది జెన్నీ. అందరూ విషాదంలో మునిగిపోయారు. ఒక మంచి మిత్రుణ్ణి కోల్పోయామన్న దు:ఖం వాళ్లను వివశుల్ని చేసింది. అయితే అందర్నీ ఆశ్చర్యపరుస్తూ తెల్లవారి తలుపు తెరచుకుని నవ్వుతూ ప్రవేశించాడు ష్రాం. 'కాస్త గీసుకుపోయింది. చిన్న గాయమే. డాక్టరు కట్టుకట్టాడు' అన్నాడు నవ్వుతూ. ష్రామ్ బతికాడుకాని మార్క్స్ విల్లిష్‌ల సంబంధం పూర్తిగా తెగిపోయింది. నాలుగు రోజుల తర్వాత లీగ్ కేంద్ర కార్యవర్గంలో చీలిక వచ్చింది.

ఇక, కేంద్ర కార్యవర్గ సమావేశం గురించి: మార్క్స్ మేధస్సు వజ్రం లాంటిది. అంత కఠినం. అంత ప్రకాశవంతం, చర్చలు, వాదోపవాదాలలో అంతిమ విజయం తనదేనని మార్క్స్‌కు తెలుసు. ప్రైవేటు మీటింగుల్లో ఉద్రేకపడి అరుస్తాడుగాని యిలాంటి బహిరంగ సమావేశాల్లో ప్రశాంతంగా వుండి ఎదుటి వాళ్లకు చెమటలు పట్టిస్తారు. ఆ మీటింగులో మార్క్స్ మూడు ప్రతిపాదనలు పెట్టినప్పుడు ప్రత్యర్థులకు ఇదే పరిస్థితి ఎదురైంది.

మార్క్స్ ప్రతిపాదనలు: 1. సంచాలక వర్గం లండన్ నుండి కొలోన్‌కు వెళ్లాలి. 2.ప్రస్తుతం వున్న రూల్స్‌ను రద్దు చేసి కొత్తవి రాసుకోవాలి 3. లండన్‌లోని లీగ్ కార్యాలయం రెండుగా విభజించబడాలి. రెండూ కొలోన్‌కే తమ నివేదికలు పంపిస్తాయిగాని దేనికదే స్వతంత్ర సంస్థగా వుంటుంది.

ఈ ప్రతిపాదనల్ని తక్షణం ఆమోదించాల్సిన అవసరం వుంది. ఎందుకంటే మనం కార్మికులకు పదిహేను, యిరవై, యాభై ఏళ్లు కూడా పోరాటం చెయ్యక తప్పదని చెడుతున్నాం. కాని మనలోని ఒక వర్గం అధికారం తక్షణమే చేజిక్కించుకోవాలంటోంది. నాకు కేవలం పన్నెండు మంది సభ్యులుంటే చాలు మిగతావాళ్లు కార్యక్రమం నుండే వెళ్లిపోవచ్చు అన్నాడు మార్క్స్.

కార్ల్ ష్నాపర్, మార్క్స్‌కు సన్నిహితుడే కాని మరో పక్షం వైపు పోతానన్నాడు మార్క్స్ చారిత్రక పరణామ సిద్ధాంతం కొందరికి 'అతి నెమ్మది' వ్యూహంగా కనిపించింది. మరణం

ఎడ్గార్

తధ్యమని తెలిసినా తను జర్మనీకి వెళ్లి యుద్ధంలో పాల్గొంటానన్నాడు ష్నాపర్. 'ఒకవేళ మార్క్స్, లీగ్‌ను విడగొట్టదలచుకుంటే కలంతో పోరాటం చేసే వాళ్లు ఒకవైపు, సాయుధ యుద్ధానికి సిద్ధపడిన వాళ్ల మరొక వైపు వుంటే బాగుంటుంది".

ఈ ప్రతిపాదనకు నిరసనగా విల్లిష్ వాకౌట్ చేశాడు. ఓటింగ్ జరిగింది. మార్క్స్ గ్రూప్ మాత్రమే ఓటింగ్‌లో పాల్గొంది. విభజన ప్రతిపాదన నెగ్గింది. లండన్‌లోని అసమ్మతివాదుల్ని బహిష్కరించమని కొలోన్‌లోని కేంద్ర కార్య వర్గాన్ని కోరాడు మార్క్స్. ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది కొలోన్. మార్క్స్ సాధించిన ఈ విజయానికి తోడుగా కమ్యూనిస్ట్ మానిఫెస్టోను 'రెడ్ రిపబ్లికన్' అనబడే యింగ్లీషు పత్రికలో ప్రచురించారు. రచయతల పేర్లు 'సిటిజన్స్ చార్ల్ మార్క్స్, ఫ్రెడెరిక్ ఎంగెల్స్'. అయితే మార్క్స్‌కు విజయాన్ని ఆస్వాదించే అవకాశం కలుగలేదు. ప్రత్యర్థులను చిత్తుగా ఓడించాడేగాని, ఒక శత్రు సైన్యమే తయారైంది (వీళ్ల మానిఫెస్టోను 'రియాక్షనరీ' అన్నారు). మరికొద్ది రోజులకే ఎంగెల్స్ మాంచెస్టర్ వెళ్లిపోయాడు ఇప్పుడు మార్క్స్‌కు కొద్ది మంది యువకులు తప్ప తోడు లేరు. మేధోపరంగా తను చర్చించగలిగింది జెన్నీతో మాత్రమే. మాజీ కమ్యూనిస్ట్ లీగ్ ప్రత్యర్థుల దాడులను ఒంటరిగా ఎదుర్కోవాల్సిందే. ఆర్థిక సమస్యలు కొనసాగుతూనే వున్నాయి. అక్టోబర్‌లో, జెన్నీ ఫ్రాంక్‌ఫర్ట్‌లో తాకట్టుపెట్టిన వెండిని అమ్మి డబ్బు పంపమని లైడెమియర్‌కు రాశాడు మార్క్స్. ఇది అత్యవసరం. ఒక మగ్, పళ్లెం, కత్తి తప్ప మిగతావన్నీ తక్షణం అమ్మేయ్యాలి (ఈ వస్తువులు తన అయిదున్నర ఏళ్ల జెన్నీ చెవి) .

పిల్లలే మార్క్స్ జీవితంలో వెలుగులు. దేశాలు మారటం, ఇళ్లు మారటం, చలి, ఆకలి, భాష తెలియని కొత్త వూరు ఇలా ఎన్ని సమస్యలున్నా 'పిల్లలు చలాకీగా ఆడుతూ పాడుతూ వున్నారు' అంది జెన్నీ. కాస్త బొద్దుగా వుండే మూడేళ్ల ఎడ్గార్ తన కోతి చేష్టలతో అదన్నీ నవ్విస్తారు. గొంతు చించుకొని తమాషా పాటలు పాడతాడు రోజంతా. ఫ్రైల్‌గ్రాత్ రాసిన 'మార్సె ' నుండి వాడు ' కమ్, ఓ, మూన్' అనే పాట అందుకున్నాడంటే యిల్లు మార్మోగిపోతుంది.

పుట్టినప్పటి నుండే జబ్బుగా వున్న పిల్లాడు గుయిడో. అయితే వాడు ఎక్కువకాలం బాధపడ లేదు. నవంబర్ 19 నాడు న్యుమోనియా ముదిరి నాల్గవ పుట్టిన రోజు తర్వాత తుది శ్వాస విడిచాడు. 'బుల్లి మందుగుండు కుట్రదారుడు' అనేవాళ్లు వాణ్ణి అందరూ. ఈ కుట్రదారు మరణించాడని ఎంగెల్స్‌కు రాశాడు మార్క్స్. 'అప్పటిదాకా నవ్వుతూనే వున్నాడు. మమ్మల్ని నవ్విస్తూనే వున్నాడు. మా పరిస్థితి ఎలా వుందో అర్థం చేసుకోగలవు. నువ్వు లేకపోవడంతో ఒంటరిగా వున్నట్టుంది'. నాలుగురోజుల తర్వాత 'జెన్నీ చూస్తే ఆందోళనగా వుంది. స్వయంగా పిల్లాడికి పాలిచ్చి పెంచింది. చివరి క్షణం దాకా వాడికోసం శాయశక్తులా పోరాడింది. ఆమె త్యాగానికి యిదా ఫలం? ' అంటూ వాపోయాడు. (2వ బాక్సు)

గుయిడోను టోటెన్ హోం కోర్ట్ రోడ్‌లోని శ్మశాన వాటికలో సమాధి చేశారు. ఆ చిన్న శవపేటికతో ఎక్కువ దూరం నడవాల్సిన అవసరం లేకపోయింది. శరణార్థులతో బిలబిలలాడే సోహో ప్రాంతంలో మరణాలు సాధారణ దృశ్యమే. శవపేటికతో మార్క్స్ కుటుంబం నడిచినప్పుడు బహుశా ఎవరూ వాళ్లను గుర్తించి వుండకపోవచ్చు. ఈ 'ఎవరూ పట్టించుకోని తనం' వాళ్ల విషాదాన్ని మరింత పెంచుతుంది. కాని పేదల బస్తీలో వుంటున్న నిరుపేదలు వాళ్లు. నాలుగడుగుల కావలే వుంటాయి కోటీశ్వరుల మేడలూ మిద్దెలూ.

లండన్, చలికాలం, 1851

పెరుగుతున్న సంపదతో బూర్జువా సంబంధాలతో సాధ్యమైనంత ఎక్కువగా వుత్పత్తి శక్తులు కూడా పెరుగుతున్నప్పుడు నిజమైన విప్లవం గురించి మాట్లాడటం అనవసరం.

-కార్ల్‌మార్క్స్, ఫ్రెడెరిక్ ఎంగెల్స్

1851లో, అందరికీ శాంతి, సంపద లక్ష్యంగా తన భర్త మొత్తం ప్రపంచాన్నే సమైక్యం చేశాడని గర్వంగా ప్రకటించింది. విక్టోరియా మహారాణి ఆమె భర్త ఆల్బర్ట్ ప్రపంచంలోని మహా ప్రదర్శన (గ్రేట్ ఎగ్జిబిషన్)ను ఏర్పాటు చేసిన ప్రముఖుల

సశేషం

▪ ఫోన్: 91776 18708

శ్రమ గోళం

శ్రమ కన్న బిడ్డ స్వేదం
శ్రమ జలం సమస్త జగతి ఇంధనం
చరా చరాలు శ్రమిస్తున్నాయి
మోయలేని భారాన్ని మోస్తూ చెట్లు
ఫలాల్ని అందిస్తాయి
పాకిపోయే మేఘాల్ని బంధించి కొండలు
వర్షాలు కురిపిస్తాయి
మైళ్ళకు మైళ్ళు పారిన నీళ్ళు
ఊపిర్లు పోస్తాయి
నిద్రాహారాలు మాని రహదార్లు
గమ్యం చేరుస్తాయి!
శ్రమ ఆయుధం
శ్రమ విద్య
శ్రమ కళ
శ్రమ క్రీడ
పంచభూతాలు శ్రమిస్తున్నాయి
గాలి శ్రమించి ప్రాణం పోస్తుంది
కాంతి శ్రమించి వెలుగు చల్లుతుంది
నింగి శ్రమించి లోహ విహంగాలకు
దారి చూపుతుంది
నేల శ్రమించి సస్యం పంచుతుంది!
రాయి రాముడిగా మారే క్రియలో
శిల్ప కళాశ్రమ
కాగితం కరెన్సీగా మారే దిశలో
అచ్చుయంత్రం శ్రమ
మానవశ్రమ సాగరం
నాగార్జున సాగరం
నిలగట్టిన నీరు పంటలకు ప్రాణమై
పారుతూ శ్రమిస్తుంది
భూమిపై పొంగాలని
సముద్రం శ్రమిస్తుంటే
హద్దు గీసి చెలియలి కట్ట
అడ్డుకుంటూ శ్రమిస్తుంది
మాటువేసి మట్టు బెట్టాలని
మనిషి శ్రమిస్తుంటే
పంజా విసిరి
తుద ముట్టించాలని
పులి శ్రమిస్తుంది
సూర్యుడు వెలుగై శ్రమిస్తుంటే
శ్రమదోచిన చంద్రుడు
వెన్నెలై శ్రమిస్తున్నాడు!

- అడిగోపుల వెంకటరత్నమ్

సెల్ : 9848252946

తోటకూర పులుసు

కావలసిన వస్తువులు

తోటకూర – 4 కట్టలు
చింతపండు – నిమ్మకాయంత
వెల్లుల్లిపాయ – 3 రెబ్బలు
ఎండు మిర్చి – 2
నూనె – 1 గరిటె
కారం – చిన్న స్పూను
ఉల్లిపాయలు – 3 పెద్దవి
మెంతులు – 2 టీ స్పూన్లు
పచ్చిమిర్చి –3
ఉప్పు – తగినంత
పోపు సామాన్లు – 1 టేబుల్ స్పూను
కరివేపాకు – 2 రెమ్మలు



తయారు చేయు విధానం

తోటకూర, ఉల్లిపాయలు సన్నగా తరిగి పెట్టుకోవాలి. స్టౌమీద బాండీలో మెంతులు దోరగా, మంచి వాసన వచ్చే వరకు వేయించాలి. తర్వాత ఒక గిన్నెలో తోటకూర, ఉల్లిపాయ ముక్కలు, చింతపండు, వెల్లుల్లి రెబ్బలు, కారం, కరివేపాకు వేసి కొద్దిగా నీళ్లు కూడా పోసుకుని ఉడకబెట్టుకోవాలి. తర్వాత దానిలో ఉప్పు వేసి మెదిపి పోపు పెట్టుకుంటే చాలా రుచిగా వుంటుంది. ఇష్టపడేవాళ్లు తోటకూర ఉడకబెట్టేటప్పుడే పచ్చిశనగపప్పు కూడా వేసుకోవచ్చు.

మజ్జిగ పులుసు

కావలసిన వస్తువులు

చిక్కని మజ్జిగ – అర లీటరు
సెనగ పిండి లేక బియ్యం పిండి – ఒక గరిటె
పచ్చిమిర్చి – 4
ఉల్లిపాయ – 1 పెద్దది
పసుపు – చిటికెడు
ఉప్పు – సరిపడా
పోపు సామాను – 1టీ స్పూను
కరివేపాకు – 2 రెమ్మలు

తయారు చేయు విధానం

మజ్జిగలో బియ్యంపిండి లేక సెనగపిండి వుండలు లేకుండా కలిపి స్టౌ మీద పెట్టాలి. అందులోనే పసుపు, పచ్చిమిర్చి చీలికలు, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి కలియదిప్పి మూత పెట్టాలి. చిన్న మూకుడులో పోపు వేసుకుని మజ్జిగలో కలుపుకుంటే సరి. అయితే ఉల్లిపాయ ముక్కలు మరీ మగ్గకుండా ఉంటే బావుంటాయి. శనగపిండి లేక బియ్యం పిండి ఇష్టమైతేనే వేసుకోవచ్చు.

పచ్చి పులుసు

కావలసిన వస్తువులు

చింతపండు – పెద్ద నిమ్మకాయంత
ఉల్లిపాయ –1 పెద్దది
బెల్లం – నిమ్మకాయంత
పచ్చిమిర్చి – 2
కరివేపాకు – 2 రెమ్మలు
ఉప్పు – సరిపడా

తయారు చేయు విధానం

చింతపండును చిక్కగా కాకుండా మరీ పలుచగా కాకుండా పులుసులా చేసుకొని గిన్నెలో పోసుకోవాలి. పచ్చిమిరపకాయల్ని వేయించి చిదిమి పులుసులో వేసుకోవాలి. అందులోనే ఉప్పు, బెల్లం, ఉల్లిపాయ ముక్కలు వేసి బెల్లం కరిగే వరకు కలుపుకుంటే చాలు పచ్చి పులుసు తయారైనట్టే.

పెరుగు గారె

కావలసిన వస్తువులు

పెరుగు – అర లీటరు
మినపప్పు – పావుకిలో
పచ్చి మిర్చి – 6
అల్లం – అంగుళం ముక్క
ఉప్పు – తగినంత
కరివేపాకు – 5 రెమ్మలు
పోపు సామాను – 2 టేబుల్ స్పూన్లు
నూనె – అర కిలో

తయారు చేయు విధానం

మామూలు గారెలకు నానబెట్టినట్టే మినపప్పు నానబెట్టి శుభ్రంగా కడిగి అందులో కొద్దిగా ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి.
పెరుగు గట్టిగా ఉంటే కొద్దిగా నీళ్లు గానీ మజ్జిగ గానీ కలిపి పల్చగా చేసుకోవాలి. అల్లం, పచ్చిమిర్చి, ఉప్పు, కరివేపాకు మెత్తగా నూరి ఈ మజ్జిగలో కలిపి పోపు పెట్టుకోవాలి.
బాండీలో నూనె వేసి బాగా కాగిన తర్వాత రుబ్బి పెట్టుకున్న పిండిని గారెల్లా చేసుకుని పక్కనే పెట్టుకున్న పోపు వేసిన పెరుగులో వేసుకోవాలి. ఈ గారెలు పెరుగులో కొద్దిగా నానిన తర్వాత తింటే చాలా బావుంటాయి.

తారలెన్ని?

ఇక్కడ నక్షత్రాలు ఒక కుప్ప మాదిరిగా పడున్నాయి కదా.
ఇంతకీ అవన్నీ ఎన్నో చెప్పకోండి?



జవాబు: నక్షత్రాలు- 20

దారి కనిపెట్టండి

ఎవరి కన్ను ఏది?

ఇక్కడ ఆరు ప్రాణుల కళ్లు మాత్రమే వున్నాయి.
ఇంతకీ ఏది ఎవరిదో చెప్పకోండి చూద్దాం?



జవాబు: 1-సింహం, 2- ఏనుగు, 3-గుర్రం, 4-మొసలి,
5-చిరుత, 6-గద్ద.



జవాబు: ఎనిమిది

వేరుగా వున్నదేది?

చేపకు ఈ ప్రపంచంలో నచ్చనిది ఏది అనడిగే ఒక్కటే సమాధానం వస్తుంది. దానిని పట్టుకోడానికి వేటగాడు ఉపయోగించే గేలం. అందుకే ఓ తెలివైన చేప తన దగ్గరున్న కత్తెరతో ఆ గేలాన్ని కత్తిరించేస్తోంది. అయితే ఈ తొమ్మిది బొమ్మలూ ఒకేలా అనిపిస్తున్నా ఒకటి మాత్రం తేడాగా వుంది. అది ఏదో చెప్పండి?

ముక్కలను కనిపెట్టాలి

ఆర్టిస్టు అంకుల్ చక్కటి బొమ్మ ఒకటి వేశారు. మీకు పరీక్ష కూడా పెడుతున్నాడు. ఈ బొమ్మ మీద నాలుగు ముక్కలున్నాయా? అవి బొమ్మలో ఎక్కడో వున్నాయట. వాటిని మీరు గుర్తించి చెప్పాలి.



జవాబు: 1) బి-1, 2) బి-3, 3) సి-4 4) ఎ-2

పదహారు పదాలు ఎక్కడ?

ఇక్కడ బోలెడన్ని అక్షరాలు కుప్పలా వున్నాయి. వాటిలో పదహారు పదాలు దాక్కున్నాయి. వాటిని పైన ఇచ్చాం. మీరే ంచేయాలంటే ఆ పదాలను కింది అక్షరాల కుప్పలో కనిపెట్టాలి. అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఎలాగైనా వుండొచ్చు. మరి ఆలస్యమెందుకు? కానిచ్చేయండి.

HOSE,
LAWNMOWER,
PAINT, SHOVEL, RAKE,
PAIL, NAILS, BROOM, SEEDS,
BATTERY, WHEELBARROW, ROPE,
SAND, SHADE, SPONGE, DOORKNOB

E	E	D	I	R	E	W	O	M	N	W	A	L
U	S	O	P	A	I	B	W	E	A	D	Y	I
S	P	O	N	G	E	R	H	T	I	O	R	A
H	L	R	O	S	H	O	V	E	L	V	E	P
A	D	K	E	E	B	O	E	K	S	P	T	B
D	E	N	T	E	A	M	E	A	O	G	T	A
E	S	O	A	D	T	O	L	R	T	O	A	R
H	O	B	T	S	P	A	I	N	T	H	B	R
W	H	E	E	L	B	A	R	R	O	W	E	O

ఎన్ని వున్నాయి?

ఈ చిన్నారి పేరు రాము. తనకు వడాపావ్‌లంటే చాలా ఇష్టం. అందుకే వాళ్ల నాన్ననడిగి ...ఇన్ని కొనిపించేసుకున్నాడు. ఇంతకీ పళ్లెంలో మొత్తం ఎన్ని వడాపావ్‌లున్నాయో చెప్పకోండి.

పదాలు పూరిద్దాం

మీకు ఇంగ్లీషు బాగా వచ్చా! అయితే ఇక్కడ ఇచ్చిన బొమ్మలను చూసి గళ్లు చకచకా పూరించేయండి.
తెలీకపోతే మా సమాధానంతో సరిచూసుకోండి.



జవాబు: 1. Pin 2. Cat 3. Coconut, comb 4. Carrot 5. Radio 6. Train 7. Ant 8. Tomato

ఎవరి భాగం ఏదో?

ఇది వింత జంతువు మాదిరిగా వుంది కదా. మరి ... ఇందులో నాలుగు జంతువుల శరీర భాగాలున్నాయి. వింతగా కాక ఎలా వుంటుంది మరి.



జవాబులు తల - బాతు, శరీరం- గుర్రం, కాళ్లు-ఒంటె, తోక-సింహం.

విలువైన సమాచారం

రచయిత డా॥ దేవరాజు మహారాజు జానపద సాహిత్యంపై 1971,1972 ప్రాంతంలో భారతి, విశాలాంధ్ర స్రవంతి, నాట్యకళ, ఆంధ్రజ్యోతి; విశాలాంధ్ర (1972 సంక్రాంతి సంచికలు) పత్రికల్లో రాసిన వ్యాసాలు, 1984 సెప్టెంబర్ 25 ఆంధ్ర సారస్వత పరిషత్తు, సారస్వత వేదిక ఉపన్యాసాన్ని; కలిపి ఈ సంపుటి వెలువరించారు. ఆదిమ సమాజంలో మనుషులు చేసే ప్రతి పని సామూహికంగా ఉండేది. పని ముట్ల తయారీ; వేట; వేటను, పంచుకు తినడం ; అంతా సామూహికమే.. సైగలు; సంకేతాలు.. అదే క్రమంలో భాష, పుట్టడం.. పని క్రమంలో ఏర్పడ్డ ధ్వనులు.. దాన్లోంచి లయ ఏర్పడడం.. లయతో ఉత్తేజితులై గొంతు కలపడం.. శ్రమలోంచి, పాట రూపు దిద్దుకొంది. గీతం – సంగీతం ఒక్కటై ధ్వనించాయి. పని భారం వల్ల వచ్చే, బరువైన ఉచ్ఛ్వాస నిశ్వాసలు, పని భారంలోని తీవ్రతను తగ్గించుకోవడానికి తీసే అరుపులు; కూతలు; పాటకు సంగీతమయ్యాయి. ప్రతి పనీ సాముహికంగా జరిగేది. పాట కూడా సామూహికంగానే వెలువడేది. సమూహంలో నిత్యనూతనంగా బతికేది. అందుకే జానపద గీతాలకు కవిలేడు అనే అభిప్రాయం గట్టి పడింది. శ్రమ విభజన మొదలై కులాలు ఏర్పడ్డప్పుడు వారి వారి వృత్తులను అనుసరించి, అన్ని రకాల పాటలు వెలువడ్డాయి. జానపదుల పరిధి పెరగడంతో జానపద సాహిత్య పరిధి కూడా విస్తృతమైంది. 19 శతాబ్దపు జానపద పండితులు.. 3 రకాల విభజన చేసారు, ఆదివాసులు , పల్లెవాసులు; నగరవాసులు; యింకా.. అనాగరికులు; కింది తరగతి వారు, పైతరగతివారు.. 'ప్రజలే నా పాటకు ప్రాణం' అన్న గద్దర్; ప్రజాజీవితానుభావాలే పాటకు పల్లవి అన్న అరుణోదయ రామారావు; ప్రజల్నించి తీసుకున్న రూపాయితేనే ప్రజల్లోకి వెళ్తాయి అంటారు వంగపండు ప్రసాదరావు. ఇలా.. జనులు, జానపదాలు; శ్రమ, ఉత్పత్తి శక్తులు.. సామాన్యులు.. పాడే, ఆడే, ఆట పాటల స్థితిగతులపై సమగ్రంగా దాదాపు 9 అధ్యాయాలుగా క్రమత పాటిస్తూ ఈ పుస్తకాన్ని వెలువరించారు. బెథోవన్ దగ్గర నుండి బీటిల్స్ వరకు అందరూ జన సంగీతాన్ని వాడిన వారే. జానపద సాహిత్యం ఆధునిక స్పృహ –జానపద సాహిత్యం –స్త్రీ బానిసత్వం – జానపదగీతాలు – స్త్రీ పురుష సంబంధాలు – జానపద గేయాలు – పరిణా మం – జానపద సాహిత్యంలో – ప్రాచీన సంస్కృతి. జానపదల గుండెల కొండల్లో పారే సెలయేళ్ళు – జానపదుల గుండె గనుల్లో దొరికేఖనిజం, బతుకమ్మ ఆటలు, పల్లెపాటలు; హృదయాల్లో ముద్రలు వేసే – జానపద గీతాలు గురించి సవిశ్లేషణాత్మంకంగా ఈ పుస్తకాన్ని వెలువరించారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ..... సాహితీ– సాంస్కృతికోద్యమ నిర్మాణ తరుణంలో.. ఈ పుస్తక ప్రయోజనం చాలా విలువైంది. రచయిత ప్రయత్నం అభినందనీయం. జానపద సాహిత్యాన్ని ప్రజాపరం చేయటంలో పరిశోధకుల కృషి కూడా రాస్తే ఈ పుస్తకానికి సమగ్రత చేకూరేది.



జానపద సాహిత్యం - ఆధునిక స్పృహ,
రచన : దేవరాజు మహారాజు,
పేజీలు : 102, వెల: 90/- రూ॥లు,
ప్రతులకు : విశాలాంధ్ర : ప్రజాశక్తి : నవోదయ బుక్ హౌస్ :తెలుగు బుక్ హౌస్‌లు.
సెల్ : 9908633949.

- తంగిరాల చక్రవర్తి

అన్యాయంపై స్పందించమని చెప్పే కథలు

నేటి జీవన పరిస్థితులను కన్నెగంటి అనసూయ "పొడిచే పొద్దు" కథలు వివరిస్తాయి. కాకపోతే అన్నీ హైదరాబాద్... కూకట్‌పల్లి... ప్రాంతం చుట్టూ తిరుగుతాయి. గ్రామీణ ప్రాంత జీవనంలోని అనుబంధాలకు కొన్ని అద్దం పట్టగా... పతితులు, భ్రష్టులు, సమాజం చీకటికోణం అట్టడుగునపడి నలిగిన దీనులు, మహిళలు రచయిత్రి కథావస్తువులు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై స్పందించాల్సిన అవసరాన్ని పాఠకులకు గుర్తుచేశారు. చక్కటి శైలి పాఠకులను ఆకట్టు కుంటుంది.

సంపుటిలోని మొత్తం 13 కథల్లో "పొడిచే పొద్దు", "కనుచూపు మేరలో" కథలు చెత్త ఏరుకునే కుర్రాళ్ళకు సంబంధించినవి. "నిజాయితీ", "నిర్ణయం" కథలు పనివాళ్ళలో ఉండే నిజాయితీకి అద్దం పడతాయి. "కలతలన్నీ కరిగిన వేళలో" తాగుబోతు జీవితానికి సంబంధించింది. కాగా బిచ్చగాళ్ళ గురించి వివరిస్తుంది "చిక్కుముడి". అవినీతిపై ఎక్కుపెట్టిన బాణం 'మార్పు మంచిదే కానీ...". మనం నెరవేర్చాల్సిన సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయి 'కర్తవ్యం", శీతాంసుముఖి" కథలు. "ఎదుటి వాళ్ళ గురించి కూడా కొంచెం" కథ గ్రామీణ రైతు జీవితాన్ని జాలితో చూపిస్తుంది. తిలక్ కథల్లోలా పశువుల అంతరంగ ఆవిష్కరణకు ప్రయత్నించారు రచయిత్రి.



పొడిచే పొద్దు (కథానికలు) , కన్నెగంటి అనసూయ,
వెల : 150 రూ/, ప్రతులకు: శ్రీ రవి పవన్ పబ్లికేషన్స్, హైదరాబాదు.

రచయిత్రి తన కథలద్వారా సమాజంలో ఉన్న చెడును ఎత్తిచూపించే ప్రయత్నం చేశారు. అయితే ఉన్నదున్నట్టు చూపితే ప్రయోజనమేముంది. ముందుకు నడిచే మంచి మార్గాన్ని చూపాల్సిన బాధ్యత కూడా రచయితలపై ఉంది. "శీతాంసు ముఖి" మహిళా సంఘాలపై విసిరిన వ్యంగ్య బాణాలు రచయిత్రి అవగాహనా పరిమితిని తెలియజేస్తుంది. పరిమితులెన్ని ఉన్నా సమాజ మార్పులో సంఘాల ప్రాధాన్యతను తగ్గించి చూడకూడదు. అనుబంధం కథ ద్వారా పనివారల సంఘటిత శక్తిని చిన్నచూపు చూసి, లొంగి పడి ఉండక తప్పదు అని చెప్పటం, తప్పుడు దారి చూపించంటం రచయిత్రి సామాజిక అవగాహనా లేమిని తెలుపుతుంది. అవినీతి, మహిళా అణచివేత, సమిష్టి తత్వం లోపిస్తున్న సమాజం పట్ల ఆవేదన, నిరాశ్రయిలపట్ల దయ వీటిపై రచయిత్రి ఆవేదన... తప్పనిసరిగా పంచుకోవాల్సిన విషయాలు. అందుకోసం చదవాల్సిన కథలివి.

- భవిష్య

శునక పోషకురాలు

ఎవరికైనా పెంపుడు కుక్క ఒకటి వుంటుంది. ఏకంగా 1300 కుక్కల ఆలనా పాలనా చూసే వాళ్లుంటే...ఏమని పిలుస్తాం. పిలవడం సంగతి తర్వాత అసలు వున్నారా? అంటే వున్నారనే సమాధానం చెప్పకోవాలి. ఇంతకీ ఆ విశాల హృదయిని ఎవరబ్బా అంటే వాంగ్ యాన్‌ఫాంగ్. ఈ చైనా మహిళకు అరవయ్యేళ్లుంటాయి. ఈమె ప్రస్తుతం ఆ కుక్కలన్నిటి భారాన్ని మోస్తోంది. రోజుకి 400 కేజీల రుచికరమైన ఆహారాన్ని వాటికి అందిస్తుంటుంది. మొదట్లో వాంగ్ వాళ్ల ఇంట్లో కనిపించిన వీధి కుక్కలను అధికారులు తీసుకెళ్లిపోయేవారట. మరి వాటిని పెంచుకోవడానికి కూడా పర్మిషన్ కావాలికదా. దాంతో శునకాలకోసం ఓ హోమ్ నడపడానికి అనుమతి ఇమ్మంటూ అధికారులను కోరి సాధించుకుంది. అలా వీధుల్లో అనాథలుగా మిగిలిపోయిన, అనారోగ్యంతో బాధపడుతున్న శునకాలను చేరదీసి వైద్యం చేయిస్తూ ఆహారం పెడుతుంటుంది వాంగ్. ఇందుకోసం విరాళాలు కూడా సేకరిస్తుందనుకోండి. వాటిని తన సొంత బిడ్డల్లా చూసుకోవడం గురించి ఇక్కడ ప్రత్యేకంగా చెప్పకోవాలి. ●

ఇళ్లకు వంతెన కడితే...

కొండలు, వాగులు, వంకలు, లోయలు దాటడానికి వంతెనలు కడుతుంటారు. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి వెళ్లడానికి కూడా వంతెన కడితే...! అదే కదా వింతల్లోకి వింత. విశేషాల్లోకి విశేషం. మీ ఎదురుగా వున్న బొమ్మలన్నీ అవే. ఈ ఆలోచన చేసింది మాత్రం 'బ్లూ ఫారెస్ట్' కంపెనీ వారు. నేల మీద ఇళ్లు కడితే ప్రత్యేకత ఏముంది? చెట్ల మీద కడితేనే కదా గుర్తింపు. అలాంటి ఇళ్లకు బ్రిడ్జిలు కడితేనే కదా రికార్డు అన్నట్టుంది ఈ కంపెనీ వాలకం. శుభ్రంగా రెండు ట్రీ హౌస్‌లు కట్టేసి రాకపోకల కోసం వంతెన కూడా కట్టించేసింది. అన్ని ఇళ్లకు మాదిరిగానే వంటగది, హాలు, స్విమ్మింగ్ పూల్, స్టడీ రూమ్ ... అన్నీ వున్నాయి ఈ ఇళ్లలో. అన్నిటికంటే ఇళ్ల మధ్య వున్న ఊయలలూగే వంతెనే ప్రత్యేకత.

●